
GIRIDHARI Registered with Registrar of News Papers of India, New Delhi.
Regn.No.APTEL / 44892 / 85-1 / 261 / 05 / R-III, Dated 5-1-2006. Date of Posting is
1st of every month at RMS RAJAHMUNDRY. Regn.No.H/RMY/05/2016 (valid upto 31-12-2016)
Postal L.C.No. AP/VM/02/WPP/2016-2018 (valid upto 31-12-2018) Licensed to post without prepayment



Printed by M.V.Bhadra Rao, Published by Swami Sundara Chaitanyananda
on behalf of Sarvagna Cultural Trust at Hyderabad and Printed at Sri
Laxmi Ganapathi Binding Works, Kovvur. Editor: C.H.Padma, M.A. (Litt).

గిరిధారి

శాశ్వత చందా రూ.750/-
10 సం॥ లకు



మార్చి 2016

యజ్ఞ పోషకులు



శ్రీ జి.శ్రీధరబాబు
హైదరాబాద్
యాభై వేల రూపాయలు



సుందర సత్సంగ్
మల్కాజ్‌గిరి
నాలుగు లక్షల రూపాయలు



శ్రీమతి ఎ.ఉమామహేశ్వరి
శ్రీ ఎ.రామలింగారెడ్డి
నెల్లూరు
యాభై వేల రూపాయలు



శ్రీమతి డి.శశిరేఖ
హైదరాబాద్
యాభై వేల రూపాయలు


మహారాజ పోషకులు
రూ.10,000/-



శ్రీమతి జి.ఎన్.వనకుమారి
శ్రీ జి.ఎస్.కిషోర్
చిత్తూరు, రూ.30,000/-



డా॥ సి.హెచ్. మోహనరావు
హైదరాబాద్, రూ.25000/-



డా॥ వి.చంద్రశేఖరం
విశాఖపట్టణం, రూ.25000/-



డా॥ శ్రీమతి ఎ. హేమకృష్ణ
శ్రీ ఎ.గిరిప్రసాద్
హైదరాబాద్, రూ.25000/-




శ్రీమతి ఎ.సరళ
హైదరాబాద్, రూ.35000/-




శ్రీమతి ఎ.భారతి
శ్రీ ఎ.రంగయ్య
హైదరాబాద్, రూ.25000/-




శ్రీమతి జి.పద్మ
శ్రీ జి.భిక్షపతి
హైదరాబాద్, రూ.25000/-



శ్రీ ఎమ్.శ్రీకర్ రెడ్డి
హైదరాబాద్, రూ.25000/-



చి॥ ఎ.నిర్గుణ్
బెంగుళూరు, రూ.20,000/-



శ్రీ జి.వెంకటేశ్వర్లు
హైదరాబాద్, రూ.15,000/-



చి॥ పి.శ్రీరుద్ర
హైదరాబాద్



శ్రీమతి కె.భూదేవి
శ్రీ కె.అమరేందర్
హైదరాబాద్




ప్రార్థన



నమస్తే అస్తు భగవన్ విశ్వేశ్వరాయ మహాదేవాయ
త్ర్యంబకాయ త్రిపురాన్తకాయ త్రికాలాగ్ని కాలాయ ।
కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ
సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయ నమః ॥

ఓ భగవాన్! విశ్వేశ్వరా! మహాదేవా! త్ర్యంబకా! త్రిపురాన్తకా! త్రికాలాగ్ని కాలరూపా! కాలాగ్ని రుద్రా! నీలకంఠా! మృత్యుంజయా! సర్వేశ్వరా! సదాశివా! శ్రీమన్మహాదేవా! నీకు నా నమస్కారము.



గిరిధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 31   సంచిక : 4

వ్యవస్థాపకులు:

శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : శ్రీమతి సి. పద్మ, M.A.

జీవిత సభ్యత్వం - రూ. 750 /-
(10 సంవత్సరములు)


డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
శ్రీ లక్ష్మీగణపతి బైండింగ్ వర్క్స్, కొవ్వూరు


వివరములకు : సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్, సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్ : (08418) 255777, 255355

Visit us at : www.sundarachaitanyam.com (*email : admin@sundarachaitanyam.org*)

ఆప్తవాక్యం



శివానుశాసనము



ఒకనాడు కళకళలాడే పచ్చని ఆకులు
మరొకనాడు వాడిపోయి రాలిపోవటం

ఒకనాడు మందహాసమును చిందించు మందారాలు
మరొకనాడు ఎండకు ఎండి రేకులు ఊడిపోవటం

ఒకనాడు గలగల పారే నదీ ప్రవాహాలు
మరొకనాడు వెలవెల పోయి మచ్చుకు చుక్క లేకుండా మిగలటం

ఒకనాడు బోసి నవ్వుల పాపాయి
చిలిపిగా పెరిగి, చింతల లోకి ఒరిగి
చర్మము ముడతలు పడి, నీలాలు తెల్లబడి
మరొకనాడు చితిలో మాయం కావటం

ఇంతే కదా అంతా!
ఏలినవారు రాలి పోయారు. రాలి పోతున్నారు
కులికినవారు కూలి పోయారు. కూలి పోతున్నా



రాలే లోగా ఊరేగాలి
కూలే లోగా కైవల్యం తెలియాలి

సర్పభ్రాంతికి ముగింపు పలకాలి
రజ్జు శాంతికి ఆహ్వానం అందించాలి

ఆనంద మందహాసంతో
వేదవాణీ నినాద సునాదాలతో
వేదాంత పిల్ల తెమ్మెరలతో
హృత్కమలమును స్పందింప చేయాలి

మనో గగనంలో
విజ్ఞాన మిత్రోదయం జరగాలి

నిజమే. మరి బాధల తిమిరాలు?
ఉండనివ్వండి వాటిని కూడా. ఏమైంది?

తొందరపాటులో కలవర పడకుంటే
చీకట్లు కూడా మనకు చక్కగా సహకరిస్తాయి

అవధులను అధిగమించుటకు
అవి పెట్టని నిచ్చెనలు

పరిధులను దాటుటకు
అవి కట్టని వంతెనలు

ప్రయాణంలో అందమైన ఓడలు
పయన మాగితే సుందరమైన మేడలు



చీకట్లను గూర్చి చింతిస్తూ, చిందులేస్తూ
చిత్తమును పాడు చేసుకోకూడదు

నాటకము యొక్క ఆరంభానికి, అంతానికి
రంగస్థలిపై ఒకే తెర ఎలా వెలుగుతుందో
మనస్సు పెట్టి మనసారా అవలోకించాలి

అగ్నిర్మథన జనిత జ్వాలా శిఖలు పైకెగసినా
చంద్రుని శీతల కిరణ సమూహాలు

కమిలి పోకుండా
కుమిలి పోకుండా
నిర్మల వినీలాకాశం లాగా
ప్రశాంత వీక్షణాలతో
మందహాసాలను చిందిస్తూ
మనుగడను సాగించే దెలాగో
నిండు హృదయంతో అర్థం చేసుకోవాలి

పట్టు తప్పిన జీవన శకటాన్ని
పట్టి నిలిపే అద్భుత శక్తిగా మారాలి

పలపు ఇచ్చిన పిలుపులో
మనసు చూపిన మార్గంలో
చేసి చూసింది చాలు

తలపు లాగిన మలపులో
మనసు లేని మహిమగా
చేయక చూసేది మేలు



అమంత్ర మక్షరం నాస్తి
నాస్తి మూల మనౌషధం
అయోగ్యః పురుషో నాస్తి
యోజక స్తత్ర దుర్లభః

మంత్రములో ఒదగని అక్షరమే లేదు
ఔషధానికి ఉపకరించని చెట్టు వేరు లేదు
దేనికీ ఉపయోగ పడని మనిషి లేదు
విలువ తెలిసి వినియోగించుకొను వారే అరుదుగా ఉంటారు

కుండలో పాలు పోస్తే
పాల వాసన వస్తుంది



తేనె నింపితే తేనె వాసన వస్తుంది
ఉల్లి నింపి మల్లె వాసన రావాలంటే వస్తుందా?

లోపల ఉన్నవే బయట పడతాయి
బయట ఉన్నవే లోనికి ప్రవేశిస్తాయి

కనిపించే వన్నీ కనుమరు గయ్యేవే
దృశ్యాలన్నీ ఏదో ఒకనాడు భస్మాలే
అన్నీ భస్మమైన నాడు
చివరికి మిగిలేది ఏమిటి?
అని ప్రశ్నించి చూస్తే
'శివుడు' అని సమాధానం వస్తుంది


అందుకనే శివసహస్రనామం
పరమశివుని **'మహాభస్మ'** అని స్తుతించింది

అన్నీ నశించినా, నశించక శోభించేది భస్మము
శివుని వలె గౌరవర్ణంతో పవిత్రంగా భాసిస్తుంది భస్మము

శివుడు తెలుపు. హిమగిరి తెలుపు
శివుని మెడలో అలరారే అస్థిమాల తెలుపు

మ్రోగించే శంఖము తెలుపు
భక్తితో మోసే వృషభము తెలుపు

తలపై నిలుపుకున్న గంగమ్మ తెలుపు
ఒంటికి పులుముకున్న విబూది తెలుపు



శివుని విషయమంతా తెలుపే
అని తెలుపుటకే ప్రకాశిస్తుంది తెలుపు వర్ణము

శివుడు జ్ఞాననేత్రమును తెరిస్తే
మిగిలేది, వెలిగేది కూడా భస్మమే

జ్ఞానము పవిత్రము. భస్మము పవిత్రము.
శివభక్తుల హృదయాలు పవిత్రంగా ఉండాలని
విచారము ఆచారము పవిత్రంగా సాగాలని
శివభక్తులు భస్మధారణము చేస్తూ ఉంటారు

సర్వేణ సర్వదా కార్యం
భూతి రుద్రాక్ష ధారణమ్

శివభక్తు లందరూ భస్మధారులై ఉండాలి
రుద్రాక్షమాలా శోభితులై విలసిల్లాలి
ఇది శివాజ్ఞ. శివానుశాసనము.

ఓం స్వామి సుందర చైతన్యానంద

సంపాదకీయం

అరుణోదయం

సి.పద్మ

కళ్ళు తెరవని పసికందు కళ్ళు తెరిస్తే పండుగ. మూడవ మాసం బోసి నవ్వులతో ఒత్తిగిల బడితే పండుగ. ఆరవ మాసం ఇల్లంతా దోగాడితే పండుగ. ఏడాది నిండితే బుడిబుడి అడుగులు పండుగ, జిలిబిలి పలుకులు పండుగ. పుట్టించిన వాని విన్యాసా లన్నీ పెరిగే బిడ్డలో కనిపిస్తూ కనువిందు చేస్తూ ఉంటాయి.

వ్యయం పెరిగే కొద్దీ మూలధనం కరిగి పోయినట్లు, వయస్సు పెరిగే కొద్దీ ఆయుష్షు తరిగిపోతూ ఉంటుంది. ప్రయాణం సాగే కొద్దీ గమ్యం చేరువైనట్లు, కాలం కదిలే కొద్దీ మరణం చేరువవుతూ ఉంటుంది.

దేహం పెరుగుతున్నప్పుడు ఉత్సాహం. సడలి పోతున్నప్పుడు నైరాశ్యం.

పెరుగుతున్నప్పుడు ఉంటాము అన్న భ్రాంతి. ఏదో పొందుతున్నాము అన్న తృప్తి.

తరుగుతున్నప్పుడు పోగొట్టుకుంటున్నాము అన్న బాధ. ఇక పోతాము అన్న భయం.

'మున్ముందు ఎంతో ఉంది' అని వయసులో అనిపిస్తుంది.
తిరిగి చూసుకుంటే 'అంతా ఇంతేనా!' అని ముసలితనంలో తెలుస్తుంది.
అనిపించే వన్నీ ఊహలు. అర్థమైతేనే నిజాలు.

రేపటి ఊహలు ఎవరికైనా తీయటి మిఠాయిలే. నిన్నటి నిజాలు, నేటి వాస్తవాలే మ్రింగుడు పడని పచ్చి వెలగకాయలు.

పెరుగుట విరుగుట కొరకే అన్న వాస్తవం వంటబడితే పెరుగు తరుగులు మనలను కలత పెట్టవు. వాటికి ఆధారమైన నియతే నిజమని తెలిసి నియతి రూపంలో ఉన్న నియంతకు మనసు నీరాజనం సమర్పిస్తుంది.

పూజలో ఉదయం సమర్పించిన పూదండ సాయంత్రానికి వాడి పోతుంది. చమురు తరిగిపోతే, దీపం ఆరిపోతుంది. కాని, ప్రతిమలో పరమాత్మ సదా భాసిస్తూనే ఉన్నాడు. భక్తుడి హృదయంలో ప్రేమ నిత్యం ప్రవహిస్తూనే ఉంది.

అందుకే, రాత్రైతే పవ్వళింపు సేవ, తెల్లవారితే సుప్రభాత సేవ - ఇలా పరమాత్మకు నిత్యార్చన కొనసాగుతూనే ఉంటుంది.

భగవంతుడే సత్యం. భక్తియే నిత్యం. దేహ బాధలు, మనోవ్యధలు, భగవంతుడి సన్నిధానంలో మటుమాయం.

సందర్శనాల వేళ గురుదేవులకు నమస్కరిస్తూ నడి ఈడు దాటిన ఒక భక్తురాలు 'మోకాళ్ళు నొప్పులు స్వామీ!' అని వాపోయింది.

గురుదేవులు కళ్ళలో కరుణను ఒలికిస్తూ, చిరునవ్వులో ప్రేమను చిందిస్తూ, 'ఇప్పటి వరకు ఎన్నో సుఖాలు అనుభవించావు. ఇప్పుడు నొప్పులను కూడా సుఖంగా అనుభవించు అనివార్యాలను అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

చీకటి వెలుగుల కలయికను రంగవల్లులుగా, కష్ట సుఖాల కలగలుపును కదంబ మాలగా దర్శించే శ్రీ స్వామీజీ ముఖ కమలం నుండి వెలువడిన అమృత వాక్కులివి.

బాధలను భరించు అని ఎవరైనా చెప్పగలరు. బాధలను సుఖంగా అనుభవించు అని ఎవరు చెప్పగలరు? బాధలు బోధకు సాధన మని ఎరిగిన సద్గురువు తప్ప!

'నీవే సుఖం, కనుక, సుఖం లోను దుఃఖం లోనూ నీవు సుఖమే. సుఖదుఃఖాలను తెలుసుకునే నీవు వాటి చేత అంటబడని పరమ సుఖ స్వరూపం' అనే దివ్య సందేశమే ఆ పలుకులలో దాగి ఉన్న పరమ రహస్యం.

ఓదార్పులు, ఔషధాలు కొంత వరకే పని చేస్తాయి. కొంత కాలమే పని చేస్తాయి. మందులు, మనుషులు చేయలేని మేలు జ్ఞానం చేస్తుంది.

వయస్సుతో వచ్చే దేహబాధలు అనివార్య మైనవి. కాని, వికృతిలో కూడా ప్రగతిని సాధించే నేర్పు మనిషికి తోడు కావాలి. పూలు సమకూర్చుకొని పూజ చేయలేని దశలో చేతులు జోడించి ప్రార్థించగలము. గుడికి వెళ్ళి భగవంతుడిని దర్శించలేని స్థితిలో గది లోనే కళ్ళు మూసుకొని ధ్యానించగలము.

సూర్యుడి వెలుగును చూడటానికి కొండలు, గోడలు అడ్డు నిలుస్తాయా?
దేహంలో వెలిగే దైవాన్ని చూడటానికి దేహ బాధలు అవరోధ మవుతాయా?
కార్యం కన్నా కారణ మెప్పుడూ వేరు కాదు. భక్తుడికి భగవంతు డెప్పుడూ దూరం కాడు.

దృఢమైన దేహంలో భగవంతుడే పరవళ్ళు తొక్కాడు. కృశించే దేహంలో భగవంతుడే ఊతగా నిలిచి ఉన్నాడు.

నవ్వుతూ తుళ్ళుతూ సూదిలో దారం ఎక్కించిన రోజులలో పదునైన దృష్టిగా ఆయననే చూశాము.
కళ్ళజోడు తగిలించుకొని గోడ గడియారం చూచే రోజులలో మందగించిన దృష్టిగా ఆయననే చూస్తాము.

పుట్టుకతో వ్యక్తిని ప్రపంచం లోకి తెచ్చిన శక్తే మరణంతో మనుగడకు తెర దించుతోంది. మనుగడ ముగిసినా తన ఉనికి ఆ శక్తి తోనే ముడిపడి ఉందని, సంబంధ బాంధవ్యాలే కాదు, చివరికి దేహం దూరమైనా ఆ నిత్యకాంతిలో తానొక కిరణంగా వెలుగుతా డని, ఆ

అనంత సాగరంలో తానొక అలగా కదులుతాడనే అవగాహన వ్యక్తికి ఎనలేని శక్తిని, అంతులేని శాంతిని ప్రసాదిస్తుంది.

వడలి పోయిన దండను చూచినట్లు సడలి పోతున్న దేహాన్ని చూస్తున్నాము. సన్న బడుతున్న చంద్రుణ్ణి చూచినట్లు, చిన్నబోతున్న మనసును చూస్తున్నాము. కొడి గట్టిన దీపాన్ని చూచినట్లు కొన ఊపిరిని చూడబోతాము. అన్నీ చూడగలుగు తున్నాము అంటే అన్నీ మన కన్నా వేరైనవని అర్థం.

నిజమైనది ఏదైనా పోతే అది నష్టం. పోయేందుకే వచ్చినవి పోతే అది కష్టమే అయినా నష్టం మాత్రం కాదు.

ఆగమాపాయినః అనిత్యాః. రాకపోకలు కలవి అనిత్య మైనవి. కనుక వాటిని సహించు అని పరమాత్మ వచనం.

వచ్చినవి పోతే ఫరవాలేదు. వచ్చి కొన్ని పోకుండా ఉన్నాయి. మరి వాటి మాటేమిటి?

తలనొప్పి వస్తే పోతుంది. జ్వరం వస్తే పోతుంది. వృద్ధాప్యం వస్తే పోదు. దృష్టిమాంద్యం వస్తే పోదు. హృద్రోగము, మధుమేహము, కీళ్ళ వాతము ఒకసారి వస్తే పోవు. వచ్చి శాశ్వతంగా తిష్ఠ వేసే ఈ బాధల వల్ల మనిషికి దుఃఖమే కదూ?

నిజమే. కాని, దేని కైతే ఇవి వస్తూ ఉన్నాయో, ఆ దేహమే నిత్యం కాదు. దేహమే నిత్యం కానపుడు దేహానికి వచ్చేవి నిత్యమా?

దొంగలు పడి ఇల్లంతా కొల్లగొట్టిన తరువాత ఇంటికి తాళం దేనికి?
అనుక్షణం దేహం మార్పు చెందుతూ ఉండగా మరణ భయం దేనికి?
మార్పు ఏమిటి, మరణం కాదా?
కల లోని కష్టాలు మనలను కలత పెట్టడం లేదు.
కల లాంటి నిజాలు కూడా మనలను కదిలించ కూడదు.
అటువంటి నిశ్చయార్థ జ్ఞానం ఆచార్యుని సన్నిధిలో మనకు కలుగుతుంది.
పుట్టుకతో ఎవరూ బలాఢ్యులు కారు. మేధావులు కారు. సాధువులు కారు.
సాధనమున పనులు సమకూరు ధరలోన.
తింటూ తింటూ ఉంటే దేహం పెరిగింది.
వింటూ వింటూ ఉంటే జ్ఞానం కలుగుతుంది.
కంటూ కనుగొంటూ ఉంటే కైవల్యం ప్రాప్తిస్తుంది.
ఈ ఆశయమే మనకు ఆశాదీపం కావాలి.
నిత్య వెలుగు వైపు ఇది ఒక కొత్త మలుపు కావాలి.
అలుముకున్న చీకట్లలో అరుణోదయం రావాలి.

జై జై గురుదేవ!

శ్రీరామతీర్థ స్వామి జీవితము

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు,
ఎమ్.ఎ.

జననము



కొన్ని శతాబ్దముల నుండి కాఱుచీకట్లు క్రమ్మిన భారతాకాశమున విశ్వదృష్టికి మిఱుమిట్లుగొల్పు తేజోగోళము లుద్భవించి ప్రకాశించినవి. ఆశాభగ్నమై యడలు చున్న యార్యజాతి నసమానప్రజ్ఞాధైర్యసాహస పూర్ణ శంఖారావముచే మేల్కొల్పి, అజ్ఞాన మౌఢ్యాహంకార కలుషిత మైన పశ్చిమ ప్రపంచమును జీవమోక్ష సంధాయక శాంతి గీతాలహరి చేత బునీత మొనర్చి, కామకాంచన వాంఛాదాసత్వముచే మానవకోటి ముఖవీధుః వెల్లువలై ప్రవహించు దుఃఖాశ్రుబిందు సందోహమును దమ పరిశుద్ధ వైరాగ్య మలయానిలములచే రగుల్కొల్పిన నిస్తుల త్యాగాగ్ని జ్వాలల వేడిమిచే హరించివైచి, చిరసంస్మరణీయ ధన్య జీవితముల బ్రదర్శించిన కొలదిమంది పావనమూర్తు లీమహర్షి భూమిని నే డలంకరించిరి.

పందొమ్మిదవ శతాబ్దములో నార్యావర్తమున జన్మించి, ఆధ్యాత్మ విద్యా రహస్యముల నామూలాగ్ర మెఱింగి, నిత్యానుష్ఠాన సిద్ధులై, వెల్గొందిన పురుష పుంగవులలో ముఖ్యులు ముప్పురు. ఇందగ్రస్థాన మాక్రమించిన పావనమూర్తి శ్రీరామకృష్ణ పరమహంస. ఈ పుణ్యమూర్తి కలకత్తా లోని దక్షిణేశ్వర వనవాటికను విడిచి యెచ్చటికి నేఁగకున్నను, ఈతని విమల హృదయమం దుద్భవించిన జ్ఞానభక్తి వైరాగ్య వాసనలు, పర్వతములు దాటి సాగరము లీది దేశదేశాంతరముల నలముకొనినవి.

పరమహంస ప్రదర్శించిన భారతబ్రహ్మవిద్యా సామ్రాజ్యమునకు వారసుడై జన్మించిన రెండవ వ్యక్తి శ్రీ వివేకానందస్వామి. మాయామూర్ఛిత మానవ ప్రపంచమున కాత్మజ్ఞానామృతధారలచే బునరుజ్జీవన మొసంగిన మహాపురుషుడు వివేకానందుడు. క్రుంగి, కృశించి, కూలుటకు సిద్ధమైన భారతజనని యచంచల వివేకానంద భుజపీఠములపై నిలబడి, నవనవోద్రేక సాహసములతో నవ్వినది. ఆకులు రాలి, కొమ్మలు విరిగి, మోడువారిన హిందూ మతవృక్షరాజము వివేకానందవిమల గీతానినాద మాఘురీఝరు లాని, వసంతారంభమునబోలె, నూత్నపల్లవముల నీనినది. తాటియాకుల దాగి, చెదలచే మ్రింగబడిన భారతబ్రహ్మర్షివాణి, వివేకానందముఖమున ఘానభోంతరాళము లేక మగురీతి మారుమ్రోగినది.

శ్రీరామకృష్ణవివేకానందుల దివ్యజ్ఞాన సందేశామృత సారము ముద్దయై, మూర్తీభవించిన ముద్దుబిడ్డడే శ్రీరామతీర్థస్వామి. ఈ మహాత్ముడు జీవించిన కాలము ముప్పదిరెండు వత్సరములే! ఈతని బ్రహ్మజ్ఞానవాణి లోకమున మ్రోగినది మూడేండ్లే! మేఘమధ్యమున మెరపుదీగ వలె, ఈ దివ్యమూర్తి యొక్కసారి మెరసి, విరమించెను. కాని, యాబ్రహ్మానంద ముద్రితమోహనమూర్తిని దర్శించిన అమెరికా, జపాన్, భారత వర్షములు, మోహోద్రేకముల మూర్ఛిల్లినవి. ఆ మెరపు లోని తళతళ లింకను ఆస్తిక ప్రపంచ రంగమున దాండవమాడుచునే యున్నవి. పరమహంస లోని నిశ్చంచల భక్తి, నిగూఢ జ్ఞానములు, వివేకానందుని లోని అఖండప్రజ్ఞా నైశిత్యము, అనర్గళ గంగా ప్రవాహతుల్య వాగ్ధార, స్వచ్ఛ స్వదేశాభిమానతన్మయత్వము, నిరువురి లోని సర్వేశ్వర సాక్షాత్కారసిద్ధి, శ్రీరామతీర్థుని యందు మేళవించి, పెంపొంది పొరలి పారినవి.

అన్ని విధముల నణగద్రొక్కబడి, యధఃపతితమైన భారతవర్షము, సజీవమై యున్నదని, లోకసందేశ మీయగల శక్తిసాహసములకు విజ్ఞానవీర్యముల కిందుగొరత లేదని వ్రేలెత్తి నిరాఘాటముగా జాటుధర్మపుత్రాగ్రేసరుల నుద్భవింపజేయగలదని, యమోఘముగా, నిస్సంశయముగా నాటి మమకార దుర్ణయమాంద్యమున బడిన పశ్చిమ ప్రపంచముచే గుర్తింపజేసిన మన కథానాయకుఁడగు శ్రీరామతీర్థస్వామి జీవితచర్యల దిలకించుటకు ముం దాపరమవీరుని పావనవంశ వృత్తాంతము నెఱుంగుట ముఖ్యావశ్యకము.

పంజాబు రాష్ట్రము లోని 'గుజరన్వాలా' జిల్లాకు జెందిన 'మురళీవాలా' యను పల్లెటూరిలో, 1873 వ సంవత్సరము అక్టోబరు 22 వ తేదీ బుధవారము మన రామతీర్థుడు జన్మించెను. రఘుకుల రామచంద్రుని కులగురు వగు వసిష్ఠమహర్షి వంశముకు జెందిన స్వచ్ఛబ్రాహ్మణ కుటుంబములో నీత డుదయించెను. భగవద్భక్తి వరదలై పొరలిపారునట్లు, హిందీ భాషలో శ్రీమద్రామాయణమును రచించి, జగద్విఖ్యాతి గాంచిన భారత భక్తాగ్రేసరుడు తులసీదా సీవంశములోని వాడే.

రామతీర్థస్వామి జనకుని పేరు 'హీరానందుడు'. ఇతడు కడు దరిద్రుడు. ప్రజ లభిమానముచే నిచ్చు గౌరవదానాదికములచే నీతడు కుటుంబ పోషణము చేయుచుండు వాడు. రామతీర్థుడు పుట్టిన కొలది దినములకే యీతని తల్లి స్వర్గస్థురా లయ్యెను. తన గర్భమున నుద్భవించిన యీ బాలుడు విశ్వలోక వంద్యుడగు నని యాయిల్లా లెఱుగునో యెఱుగదో! పెద్దన్న యగు గురుదాసు, ముదుసలి మేనత్త యగు నొకనారీమణియు మనరాముని బెంచి పెద్దవానిని జేసిరి.

పసిబిడ్డకు దల్లి లేని లోటు నెవరు తీర్చగలరు! పుట్టిన కుటుంబమా దరిద్ర

దేవతా నిలయము! సహజ ప్రేమామృతము స్తన్యముతో గలిపియుచ్చు కన్నతల్లియా కడుపార గన్న బాలుని గన్నారఁ జూచుకొను భాగ్యమైన లేకుండ మరణించినది! ఇక నీదిక్కులేని బాలుఁడెట్లు పెరుగును? వృద్ధవనిత యగు మేనత్త రామతీర్థు నావుపాలు పోసి పెంచినది. ఈ వనిత భక్తురాలు, పతివ్రతాతిలకము. దినదిన మీమె యాలయములకు దేవతా దర్శనమునకై పోవుచు జంటిపిల్ల వానిని జంక నెత్తుకొని వెడలు చుండెడిది. ఆలయములో జరుగు ప్రార్థనలు, కీర్తనలు, మంగళతూర్య నినాదములు, హారతులు, నివి చూచినంతనే వెక్కి వెక్కి యేడ్చుచున్న బాలుడు, దుఃఖము మాని, కుతూహలముతో దిలకించువాడు. ఆటబొమ్మలు, మిఠాయిదినుసులు నవలద్రోసి, యాలయము వైపు తన్ను దీసికొనిపొమ్మని యీతడు మేనత్తకు వ్రేలుచూపువాడు.

బాల్యదశ

సన్న్యాసాశ్రమమందు గాల్పెట్టుదాఁక మన రామతీర్థుని మనము రాముడనియే పేర్కొందము. దివ్యకుసుమము నందలి లోకాతీత సౌరభము మొగ్గ లోనే తెలియునట్లు తల్లి పాలు లేక, ఆవు పాలు పడక, శల్యగత ప్రాణియై యున్న రెండేండ్ల బాలుడగు మన రాముడు, దేవాలయములో జరుగు రామకథా కాలక్షేపమందే కుతూహల చిత్తుడై యుండుట గాంచిన నాతని భావి మహోన్నత జీవితం ఊహాతీతము కాదు.

అక్షరబ్రహ్మ విద్యాధురీణుడగు రాముని కైదవయేట అక్షరాభ్యాసము జరిగెను. స్వగ్రామ మగు 'మురళీవాలా' లోని వీధిబడి కాతడు పోవుచుండెడి వాడు. ఐదవ తరగతిలో నుండగనే, పర్షియను భాష లోని రెండు గ్రంథములను, ఉర్దూ గీతములను పెక్కింటి నాతడు కంటస్థ మొనర్చుట చేతనే కాక, దినదినము నాలయములో జదువగా విన్న పురాణ శ్లోకముల నింటికి వచ్చి, యొప్పగించుటచే నీబాలునికి గల మేధా సంపత్తి విద్యార్జన లాలసత్వము, జ్ఞాపకశక్తి, తెలియగలవు. మన రామున కాటలన్నా నసహ్యాము. బడి విడుచుట తోడనే పురాణములు వినుటకై పోయి, భారత రామాయణ కథల నుత్సాహ పరిపూర్ణుడై వినుచుండువాడు. ఒకసారి విన్న సంగతి నాతడెన్నడు మరచి యెరుగడు.

పదేండ్లు నిండునపటికి రాముడైదవ తరగతి పూర్తి చేసి, స్వగ్రామమున కేడుమైళ్ళ దూరమున నున్న గజరన్వాలా లోని ప్రాథమికోన్నత పాఠశాలలో జేరెను. గజరన్వాలాలో నీతనిని దండ్రి తనకు మిత్రుడగు భగవద్దన రామాజీ యను గురువున కొప్పగించెను. కొన్ని వత్సరములు గడచిన వెనుక నీ గురువే మన రామున కాధ్యాత్మిక విద్యా ప్రదాత కూడా నయి, రామునిచే విశేషము మెప్పు పొందినాడు. గురువు నెడ రాముడు చూపిన భక్తి విశ్వాసము లప్రతిమానములు. సమస్త విషయములలో రాముడు, గురువునే తండ్రిగా,

దల్లిగా, బంధువుగా, దైవముగా నారాధించి, తాను పట్టభద్రుడగు లోపున నించుమించుగా నొక వేయి లేఖలను గురువునకు వ్రాసి యున్నాడు.

రామునకు బదవ యేటనే వివాహము జరిగినది. గుజరన్వాలా జిల్లా లోని వాజీరబాదా తాలూకాకు జెందిన 'విరోకి' యను గ్రామమున నున్న రామచంద్ర పండితుని కుమారి మన రాముని ఇల్లాలు. రామునికింత బాల్యములో వివాహ మగుటకు రాముడు బాధ్యుడు కాడు. పెరిగి పెద్దయై, భారత సాంఘిక ధర్మములను దిద్దునాడు రామతీర్థస్వామి బాల్య వివాహములను గఠినముగా దూషించి యున్నాడు. విద్యారంభము కాకుండగనే జరిగిన ఈ బాల్య వివాహము వలన మన రాముడు కళాశాల తరగతులలో జదువు చున్నప్పుడు పడిన యాతనలు భరింప రానివి. కష్టాగ్ని జ్వాలల గాలితో నలిపి, యార్పివైచు సహనము గల స్వామి, ఈ భారము నంతగా లెక్క జేయలేదు. కాని, యాతని స్థితిలో సామాన్య మానవుడున్న నాత్మహత్యను వరించి యుండెడి వాడే.

పదునైదేండ్లు వచ్చునప్పటికే రాముడు మెట్రిక్యులేషన్ పరీక్ష యందు దన పాఠశాలలో నగ్రస్థానమును, విశ్వవిద్యాలయము నందు ముప్పది యెనిమిదవ స్థానమును బడయ గలిగెను. యీతని ప్రథాన స్థానమునకు మెచ్చి, గుజరన్వాలా పట్టణ సంఘము వారీతనికి గళాశాలలో జదువుటకు గొంత ధన మొసగిరి.

ఇక రాముని మార్గము కంటకారణ్యమే. ఆతనికి జ్ఞాన తృష్ణ యనంతము; మేథా సంపత్తి సునిశితము; కాని, ధన సహాయ్యము లేదు; సంసార భారము కూడా మీద బడినది. రాముడు మహాసాగరము దాటవలసి వచ్చినది. కష్టసాగరమున కీతడు వంతెన నెట్లు నిర్మించినాడో ముందు చూతము.

(సశేషం)

జ్ఞానయోగి టెలివిజన్ ప్రసారాలు

*'జ్ఞానయోగి' టి.వి.లో పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి ప్రవచనములు ఉదయం 6.30 నుండి 7.00 వరకు, రాత్రి 8.00 నుండి 8.30 వరకు ప్రసార మవుతున్నాయి. ప్రస్తుతం ఉదయం **'సాధ్యము - సాధన'** పైన, రాత్రి శ్రీఆదిశంకరాచార్య స్వామి విరచితం **'శివపంచాక్షర స్తోత్రం'** పైన ప్రవచిస్తున్నారు.*



ఆశ్రమ కమిటీ

బాల చైతన్యం

చిరంజీవులకు

ఆశీస్సులు. ఓం నమో భగవతే వాసుదేవాయ.




మనది ప్రాచీనమైన వేదసంస్కృతి. అద్భుతమైన కళలకు, కవిత్వానికి, ఆదర్శమైన సంగీత సాహిత్యాలకు, అనితరసాధ్యమైన శిల్ప చిత్రలేఖనాదులకు, అమూల్యమైన విద్యా వేదాంతాలకు మన భారతావని పుట్టినిల్లు. సముద్రంలో ఆణిముత్యాలు లభించునట్లు మన సంస్కృతిలో మీకు జ్ఞానమణు లెన్నో లభిస్తాయి. ఆ ప్రయత్నంలో భాగంగా ఈ సంచిక నుండి మన జ్ఞానాన్ని, శీలాన్ని పోషించే ఆసక్తికర మైన విషయాలను ఆలోచిస్తూ, ఆనందిస్తూ, వేడుతూ, పాడుతూ నేర్చుకుంటాము. ముందుగా ఒక చిన్నకథను పంచతంత్రం నుండి నేర్చుకుందాం.

వివేకం వినాశ మెరుగదు

ఒక నదీతీరంలో మామిడిచెట్టు మీద ఒక కోతి నివసిస్తూ ఉండేది. తియ్యని మామిడిపండ్ల నారగిస్తూ ఆనందంగా జీవనయాత్ర సాగిస్తూ ఉండేది.

సమీపంలో ఉన్న నదిలో ఒక మొసలి ఉండేది. ఒకనాడు మొసలి ఈదుకొంటూ తీరము వరకు వచ్చి, "ఓ మిత్రమా! మర్కటమా! నాకు చాలా ఆకలిగా ఉంది. నీవేదైనా ఇచ్చి నా ఆకలి తీర్చగలవా?" అని అడిగింది.

"ఓహ్! దానికేమి? ఇవిగో చెట్టు నిండా మామిడిపండ్లు ఉన్నాయి. పైగా ఇవి చాలా తియ్యగా ఉంటాయి. ఇస్తాను ఉండు", అని పలికి, చెట్టులోని పండ్లను కోసి మొసలికి ఇచ్చింది.



మొసలి ఆ పండ్లను తిని, "ఓహ్! చాలా రుచిగా ఉన్నాయి. ఇలా ఉంటాయని నేను ఊహించ లేదు. మిత్రమా! నీకు అభ్యంతరం లేకపోతే, మరి కొన్ని ఇస్తే, వాటిని తీసుకెళ్ళి నా భార్యకు కూడా

ఇస్తాను" అంది మొసలి. కోతి అలాగేనని మరికొన్ని మామిడిపండ్లు కోసి ఇచ్చింది.

మొసలి తీసుకెళ్ళి మామిడిపండ్లను ఆడమొసలికి ఇచ్చి, తన స్నేహితుడు చేసిన సహాయాన్ని స్మరించుకొంది.

భర్త ఇచ్చిన మామిడిపండ్లను ఆరగించిన ఆడమొసలి ఆశ్చర్యంతో "ఆహా! ఈ పండ్లు ఎంత మధురంగా ఉన్నాయి. మరి మీ స్నేహితుడు ఈ పండ్లు రోజూ తింటూ ఉంటాడా?" అని ప్రశ్నించింది.

"అవును. అతనికి ఈ పండ్లే ఆహారము. వీటితోనే జీవిస్తాడు" అన్నది మొసలి తన భార్యతో.

ఆడమొసలికి దుర్బుద్ధి పుట్టింది. మధురమైన ఈ ఫలాలను ఆరగించే మర్కటము యొక్క మాంసము ఇంకా ఎంత మధురంగా ఉంటుందో? ఎలాగైనా వానరాన్ని చప్పరించి వేయాలని భావించింది. ఉపాయాన్ని కూడా ఆలోచించింది.

ఒకనాడు భర్తను పిలిచి, "ఏమండీ! నాకు ఆరోగ్యం బాగా పాడైపోయింది. వైద్యుడు చూచి, నా ఆరోగ్యం బాగుపడాలంటే కోతిగుండెను తినాలట. మరో మార్గము లేదంటున్నాడు. నేను బ్రతకాలంటే మీరు మీ స్నేహితుని నాకు ఆహారంగా అప్పచెప్పాలి" అన్నది.


పాపం! ఏం చెయ్యాలో భర్తయైన మొసలికి అర్థం కాలేదు. తన మగువ కొరకు మిత్రుని త్యాగం చెయ్యలేక ఆవేదనతో మగమొసలి క్రుంగిపోయింది. అయినా ఆడ మొసలి తన పట్టును వీడలేదు. ప్రతిరోజు భర్తను వేధించసాగింది. ఇక చెయ్యగలిగింది లేక మగ మొసలి మిత్రుడైన మర్కటాన్ని సమీపించింది.



"మిత్రమా! వానరా! నా సతీమణి నిన్ను మా ఇంటికి ఆతిథ్యానికి ఆహ్వానించమన్నది. నా ఆహ్వానాన్ని మన్నించవా? అని అడిగింది. "అయ్యో! అదేమిటి మిత్రమా? నువ్వు ఇంతగా అభ్యర్థించాలా? తప్పకుండా వస్తాను" అని బయలుదేరింది కోతి. వీపు మీద కోతిని ఎక్కించుకొని మొసలి నదిలో ఈదుతోంది.

నదీ మధ్యమునకు రాగానే మొసలి మునిగిపోతోంది. "మిత్రమా! మకరమా! అదేమిటి? మునిగిపోతున్నావు. నాకు ఈత రాదు" అన్నది కోతి.

"క్షమించు మిత్రమా! ఇక నేను నిజాన్ని దాచలేను. నా భార్య రోగంతో బాధపడుతోంది. నీ గుండెను తింటేనే ఆమె ఆరోగ్యం సరిపడుతుందని వైద్యుడు చెప్పాడట. అందుకని, అనివార్య పరిస్థితుల్లో నిన్ను వధించటం తప్పడం లేదు. మిత్రుని దూరం చేసుకోలేక, మగువకు దూరం కాలేక అనుక్షణం చితికిపోతున్న నా హృదయానికి శాంతి కలగటానికి ఇంతకన్నా మరో మార్గం కనిపించలేదు అన్నది మకరి.



తన బ్రతుకు ప్రమాదంలో చిక్కుకుందని కోతికి అర్థమైపోయింది. అపాయం వచ్చినపుడు అధైర్యపడకుండా ఉపాయంతో బయటపడువారే విజ్ఞులు అని భావించి, "మిత్రమా! మకరమా! ఈ విషయాన్ని మనం బయలుదేరే ముందే నువ్వు నా కెందుకు చెప్పలేదు? నేను నా గుండెను చెట్టుతొఱ్ఱలో పెట్టి వచ్చాను. మనం వెంటనే వెనక్కి వెళ్ళి గుండెను తీసుకొని వస్తాము. పద. స్నేహితుని కన్నా ప్రాణం మిన్న యని నేను భావించను. నీ అర్థాంగి నావల్ల జీవించగలిగితే అంతకు మించిన ఆనందం నాకు మరొకటుండదు" అన్నది కోతి.

మొసలి ఎంతగానో సంతోషించింది. రెట్టించిన ఉత్సాహంతో వెనుదిరిగి తీరమును సమీపించింది. అంతే. కోతి గట్టుపై దుమికి చెట్టునెక్కింది.



"మిత్రమా! మకరమా! ఇక వెళ్ళు. మన స్నేహం ముగిసింది. నీ సతీమణికి నా మాటగా ఒక్క విషయాన్ని చెప్పు. అన్ని వేళలు తనవి కావని చెప్పు. మంచిని వంచించే మనస్సుకు సుఖముండదని చెప్పు. బండరాతి గుండె గల నీ భార్యకు నా గుండె దొరకదని చెప్పు", అని మామిడి పండు కోసి తినసాగింది కోతి. నిరాశతో మకరి ఇంటికెళ్ళింది.

నీతి:- ధనం అన్ని వేళల రక్షించదు. జ్ఞానం సదా, సర్వత్ర విజయాన్ని సాధిస్తుంది. కరగని, అరగని అక్షయధనం జ్ఞానమే.

కథను చెప్పుకున్నాం. ఇప్పుడు నేను మీ ముందు కొన్ని విషయాలను ఉంచుతున్నాను. వాటిలో ఏది సరైన సమాధానమో మీరే నిర్ణయించి ఖాళీలను పూర్తి చెయ్యాలి.

1. గృహ నిర్మాణమును చేయుటకు ముందుగా ఆచరించు కర్మను ------------ అందురు.
   (1) గృహప్రవేశము (2) దీపారాధన (3) భూమిపూజ (4) నామకరణము.

2. సూర్యదేవాలయము ---------------- లో ఉన్నది.
   (1) శ్రీకాళహస్తి (2) కన్యాకుమారి (3) ప్రయాగ (4) కోణార్క.

3. రాముడు యుద్ధములో రావణుని జయించిన దినము -------------
   (1) రామనవమి (2) దీపావళి (3) దసరా (4) హోలీ.

4. ఆలయ నిర్మాణమునకు సంబంధించిన శాస్త్రము ----------------
   (1) నాట్యశాస్త్రము (2) ఆగమశాస్త్రము (3) అర్థశాస్త్రము (4) శిల్పశాస్త్రము

5. కౌరవులకు, పాండవులకు చిన్నాన్న -------------
   (1) శకుని (2) రుక్మి (3) విదురుడు (4) సంజయుడు.

(మీరు రాసినవి సరిగ ఉన్నవో లేదో 36 వ పేజీలోని సమాధానాలతో సరిపోల్చుకోండి)

మరి, ఇప్పుడు చదువుల తల్లి, మాటలమ్మ అయిన సరస్వతిని అందమైన శ్లోకంతో ప్రార్థించడం నేర్చుకుందాం.

యా శ్రద్ధా ధారణా మేధా
వాగ్దేవీ విధివల్లభా ।
భక్త జిహ్వాగ్ర సదనా
శమాది గుణదాయిని ॥

ప్రతిపదార్థము :- యా=ఏ, శ్రద్ధా=శ్రద్ధయు, ధారణా=ధరించు శక్తి, మేధా=స్మృతిజ్ఞానము, వాగ్దేవీ=వాగ్దేవత, విధివల్లభా=బ్రహ్మదేవుని భార్య, భక్త=భక్తుల యొక్క, జిహ్వాగ్ర=నాలుకపై, సదనా=వసించునది, శమాది గుణదాయినీ=మనోనిగ్రహము మొదలైన సుగుణములను అనుగ్రహించునది.

తాత్పర్యము :- అమ్మా! సరస్వతీ! నీవు శ్రద్ధాస్వరూపిణివి. ధారణాశక్తివి. మేధానిధివి. వాగ్దేవీ! నీవు బ్రహ్మసతివి. భక్తులకు శమాది గుణములను ప్రసాదించు తల్లివి. భక్తుల నాల్కలపై సదా వసించు చుందువు.

ఈ శ్లోకాన్ని కంఠస్థము చేద్దాం. భావాన్ని మనస్సులో నింపుకుందాం. ప్రతిరోజు ఈ శ్లోకంతో శారదామాతను ప్రార్థిస్తే మనకు విద్యాబుద్ధులు పుష్కలంగా లభిస్తాయి.

ఇక ఇప్పుడు చివరగా నేను కొన్ని పొడుపుకథలు చెబుతాను. వాటిని మీరు విప్పాలి.

1. పై నొక పలక కిందొక పలక
పలకల సందున మెలికల పాము

2. చెట్టుపై నుంటుంది పక్షి కాదు.
మూడు కన్నులుంటాయి శివుడు కాదు
చర్మం కప్పుకుంటుంది సోమయాజి కాదు.
కడుపునిండా నీళ్ళుంటాయి మేఘం కాదు.

3. చెట్టుకు పుట్టింది తీగకు పుట్టింది
రాతికి పుట్టింది
మూడూ కూడి ఆడి రక్తి కట్టిస్తాయి.

4. కిటకిట తలుపులు కిటారి తలుపులు
తీపినా వేసినా చప్పుడు కావు.

5. పుట్టెడు సెనగలలో
ఒక్కటే రాయి.

(జవాబులు 36 వ పేజీలో ఉన్నాయి. సరిచూసుకోండి)





Inner Communion

Kaviyogi Maharshi
Sri Swami Shuddhananda
Bharati

Our pilgrim soul seeks Thy Sanctum
O Gracious Heart of hearts!
To cross the flesh, to hush the mind
To traverse hills and dales of modes!

Our pining soul prays for strength
Without Thy grace the human life
shall flicker and die like heartless love.

Like power from plus and minus wires
Like fruits from fertile Garden trees
Like tender love from the Mother's heart
Like music from the tuned harp,

Like the Zyphyr-touch of fragrant morn
Let love and faith flood our heart
And stream down to serve humanity
In its struggle towards ultimate divinity.

Thou art the path, Thou art our goal!
Thou art our Guide, O gracious All-in-All!
We surrender our destiny into Thy hands...
Lead us to unity of all lands!

ధ్యాన వైభవము

స్వామి సుందర చైతన్యానంద



సూర్యాస్తమయంతో విశ్వంలో వెలుగులు ఆరిపోతాయి. చీకట్లు ముసురు కుంటాయి. ఇవి బాహ్య తిమిరాలు. బాహ్యంలో చీకట్లు ఉన్నంత మాత్రాన వ్యక్తి ఆంతర్యంలో అంధకారం ఉండ నవసరం లేదు.

బాహ్యం లోని చీకట్లు మనల్ని బాధించవు. ఆంతర్యంలో చీకట్లు వ్యాపిస్తే బాహ్యంలో వెలుగులున్నా వ్యక్తి గ్రుడ్డివాడు గానే మిగిలి పోతాడు. అస్తమించిన సూర్యుణ్ణి వెంటనే తీసికొని వచ్చి ఆకాశంలో ఉంచడం ఎవ్వరికీ సాధ్యం కాదు. కాని, హృదయాకాశంలో అస్తమించిన వెలుగుల్ని తిరిగి ఆవిష్కరించుకోవడం వివేకవంతులకు అసాధ్య మేమీ కాదు.

బాహ్యంలో ఒక్క వెలుగులే కావు; ఏవయినా మారుతూనే ఉంటాయి. ఒకే లాగ ఉండవు. అలాగని, వాటితో పాటు మనిషి కూడా తదనుగుణంగా మారుతూ పోతే, విశ్వంలో చీకట్లు వ్యాపించి నపుడు వాటి ప్రభావం మనస్సుపై కూడా ఉంటుంది. మనిషిపై ఉంటుంది. మనుగడే చీకటిమయ మవుతుంది. అది ఎంత దుర్భరమో ఆలోచిస్తే అర్థ మవుతుంది.

దుర్భరమైన మనస్సును కలిగిన దుర్బలులకు ధ్యాన మనేది దుర్లభం గానే ఉంటుంది. ధ్యాన మనేది పరమేశ్వరునికి సంబంధించి మనం సాగించే మానస వ్యాపారము. మార్పుల సంగీతానికి నాట్యం చేసే మనస్సు మార్పులేని మహేశ్వరునిపై ఎలా ధ్యానం చేస్తుంది?

ధ్యానం చేయడానికి కొందరు పూజాగది లోకి వెళ్ళొచ్చు. కొందరు మందిరాలకు వెళ్ళొచ్చు. కొందరు వన ప్రదేశాలకు పోవచ్చు. మరికొందరు నదీతీరాలను చేరవచ్చు. ధ్యానం చెయ్యడానికి ఎవరు ఎక్కడికి పోతున్నారు? అనేది తెలియదగిన విషయం కాదు. కాని, ధ్యానం చేసేవారు అందరూ ప్రవేశించేది మనస్సు లోకే అనేది మాత్రం ధ్యాన యోగులకు తెలియవలసిన విషయం.

విహారయాత్రలకు ఒంటరిగా వెళ్తే సుఖ ముండదు. కొందరితో కలసి వెళ్ళాలి. కాని ధ్యానవిహారానికి వ్యక్తి ఒంటరి గానే వెళ్ళాలి. అప్పుడే సుఖం. అందుకనే ఏకాంతమున **(రహసిస్థితః)** ఒంటరిగా **(ఏకాకీ)** ధ్యానాన్ని ప్రారంభించ మన్నాడు గీతాచార్యుడు. ఏ సహాయ ము లేనివాడుగా ఏకాకిని అభివర్ణించారు శ్రీ ఆదిశంకరాచార్యస్వామి **(రహసి స్థితః సన్ ఏకాకీ అసహాయః).**

ధ్యానంలో అన్యుల సహాయము అవసరము లేదు. ఆదుకోవటానికి ఆలంబనంగా ఉండటానికి అచ్యుతుడు అక్కడ సిద్ధం గానే ఉన్నాడు. అదే ధ్యాన వైభవము.

కొన్ని విషయాలలో ఇతరుల సహాయం మనకు అవసరం. కాని, ధ్యాన విషయంలో అన్యుల ప్రవేశము అనూహ్యము. పైగా ప్రతిబంధకము కూడా. మూటను తల పైకి ఎత్తడానికి ఇతరులు సహకరించాలి. శ్వాసలను ఆడించడానికి అన్యుల సహాయము మనకు అవసరమా? అక్కడ కూడా అతిప్రేమను కూడగట్టుకొని అన్యులు ప్రవేశిస్తే, శ్వాసలు ఆడుతాయో, ఆగుతాయో చెప్పలేము. ధ్యానం విషయంలో కూడా ఇతరుల ప్రమేయం ఇలాగే ఉంటుంది.

కనుక ధ్యానయోగి ఒంటరి వాడుగా ధ్యానాన్ని కొనసాగించాలి. ధ్యానానికి ఏకాకిగా ప్రవేశించాలి. ధ్యానంలో ఏకాకిగా ఉండాలి. అంటే, తోడు ఎవరూ ఉండకూడదు. తోడు అనేది మనస్సుకు సంబంధించిన విషయమని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటున్నాను.

ఏకాకి మనస్సులో ఎవ్వరూ లేరు. లేకుండా ఉండాలి. సరే. వ్యక్తులు లేరు. విషయాలు ఉండవచ్చా? ఏ విషయాలు? వ్యక్తులకు సంబంధించిన విషయాలే కదా? వ్యక్తులు వేరు - విషయాలు వేరుగా ఉన్నాయా? విషయా లుంటే వ్యక్తులు ఉన్నట్లే. కనుక, ఏకాకి అంటే వ్యక్తులు, విషయాల నుండి విడిపడి యున్నవా డని అర్థం. అప్పుడే ధ్యానం సాగుతుంది. మనస్సును ధ్యానంలో నియమించడ మంటే ఇదే **(యోగీ నియత మానసః - నియతం సంయతం మానసం మనః యస్య సః అయం నియతమానసః).**

ఏ సహాయం లేకుండా, ఎవరి సహాయం లేకుండా తనలో తాను సుఖించడం తెలిసినవాడు ధ్యానయోగి **(యోన్త సుఖోన్తరారామః).** తన ఆత్మ యందే తాను సుఖించు వాడు, రమించువాడు అని అర్థము **(యః అన్తః సుఖః ఆత్మని సుఖం యస్య సః అన్తః సుఖః, తథా అన్తః ఏవ ఆత్మని ఆరామః క్రీడా యస్య సః అన్తరారామః).** ధ్యానయోగి ఆత్మ యందే సుఖించేవాడు కావాలి. ఆత్మయందే విహరించేవాడు కావాలి.

అలా ఉండాలి అంటే, బాహ్యవిషయాలు అతడిని బాహ్యానికి లాగకుండా ఉండాలి. బయట విషయాలు లోపలున్న వ్యక్తిని ఎలా లాగుతాయి? అవి లోపల ఉన్నప్పుడే లోపల సుఖించే వాణ్ణి బాహ్యానికి ఈడుస్తాయి. అలా జరుగకూడ దనేది అభిమత మైతే, బాహ్య విషయాలను లోనికి రానివ్వకుండా బాహ్యం లోనే ఉంచి యోగి ధ్యానంలో ప్రవేశించాలి. పాదరక్షలను గుడి బయట ఉంచి ఆలయం లోకి ప్రవేశించినట్లు, బాహ్య విషయాలను బాహ్యం లోనే ఉంచి ధ్యానం లోకి ప్రవేశించాలి **(స్పర్శాన్ కృత్వా బహిః బాహ్యాన్).**

కాళ్ళకు చెప్పుల్ని తొడుక్కుంటామే గాని చెప్పులకు కాళ్ళు లేవు. కనుక, ఎక్కడ మనం విడిస్తే, అక్కడే విడవకుండా పడి ఉంటాయి. కాని, విషయాలు వేరు. వాటికి రెక్కలున్నాయి. రెక్కల్ని ఆడిస్తూ గగన విహారం చేస్తాయి. హృదయాకాశం లోకి చొచ్చుకొని

వస్తాయి. అప్పుడేమి చెయ్యాలి?

ధ్యానంలో ధ్యానయోగి ఏదో చేసేవాడు కాడు. ఏదో చేయకుండా ఉండేవాడు. ఇప్పుడూ అదే చెయ్యాలి. చూస్తూ ఉండాలి. చేస్తూ ఉండకూడదు.

ఆకాశంలో ఎండ ఉంది; నువ్వు చూస్తున్నావు. వాన ఉంది; నువ్వు చూస్తున్నావు. గాలులు వీస్తున్నాయి; నువ్వు చూస్తున్నావు. వెన్నెల ఉంది; నువ్వు వీక్షిస్తున్నావు. ఇవన్నీ ఆకాశం లోనే తెలుస్తున్నాయి. ఇవేవీ లేకపోయినా ఆకాశము ఉంది. ఉంటుంది. వినిర్మలంగా ఉంటుంది. విశుద్ధం గానే ఉంటుంది.

ఎండ తీవ్రంగా ఉంది. వర్షం భయంకరంగా కురుస్తోంది. గాలులు చల్లగా వీస్తున్నాయి; వెన్నెల మసకగా ఉంది - ఇలాంటి మాటలు వినిపిస్తాయేమో గాని, ఆకాశం బాగలేదు అని ఎవ్వరూ అనరు. ఆకాశం మీద ఎవ్వరికీ అభియోగాలు లేవు; ఫిర్యాదులు ఉండవు. అందుకే అది ఆకాశం. అన్నిటికీ అవకాశ మిస్తూ **(అవకాశప్రదాతృ)** తన విషయంలో అవకాశ మివ్వని అద్భుతమే ఆకాశము. అందుకే నిరుపమానమైన పరమేశ్వరుని ఆకాశంతోనే పోల్చారు **(గగన సదృశం).**

ఆకాశం వినిర్మలంగా ఉన్నట్లు ధ్యానయోగి ఆంతర్యం విశుద్ధంగా ఉండాలి. రాగాల వానలో నానకుండా, ద్వేషాల ఎండలో ఎండకుండా, ఈర్ష్యాసూయల చలిలో కుంచుక పోకుండా, వచ్చేవి వచ్చి పడుతున్నా, పోయేవి పరుగు లెత్తుతున్నా, తనలో ఏ చలనం, సంచలనం లేని ఆకాశం లాగా స్థిరమైన, నియతమైన మనస్సు ధ్యానంలో ఉండాలి. ఇక్కడే తనను తాను ప్రశాంతాత్మగా అనుభూతిని పొందడం జరుగుతుంది.

జరగ వలసినవి జరిగాయి. జరగ కూడనివి జరగాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. నియతి భగవత్స్వరూపము. దానిని అతిక్రమించడం ఎవరికీ సాధ్యం కాదు.

అవసర మనుకున్నవి దూరమై మన జీవితంలో వాటి అవసరాన్ని కుదించు కున్నాయి. ఇక అవి మనకు అవసరం లేనివి అని మదింపు వేసుకోవాలి. ఉండలేనివే పోతున్నాయి. పారి పోతున్నాయి. ఉండి వెలిగినవే ఉండలేక ఆరి పోతున్నాయి. ఉన్న మనస్సులే మారి పోతున్నాయి. కలసి ఉండలేక కారిపోతున్నాయి. పోయేందుకే వచ్చిన దేహాలు బలహీన పడిపోతున్నాయి.

అన్నిటిలో నియతి ఉంది. నియతిరూపంలో నియంతే ఉన్నాడు. అర్థం చేసుకుంటే ఏదీ ధ్యానానికి అవరోధము కాదు. అర్థం కానపుడు మనకు మనమే అవరోధం. మన మనస్సే మనకు పెనుభూతం.

ధ్యానంలో భూతాలు లేవు. భవిష్యత్తులు మిగలవు. అక్కడ అంతా వర్తమానమే. పరమేశ్వరుని వర్తమానాన్ని ఆలకించడమే. అది కరుణా పూరితమైన తొలకరి. ఆ తరువాత, అంతా వర్షమే. జ్ఞానవర్షమే. ఆచార్యుని అనుగ్రహవర్షమే. **ఓం.**

అక్షర స్తుతి

గడ్డం చంద్రయ్య
సిరిసిల్ల



సీ॥ నీకంటి చూపులో ఏ శక్తి ఉన్నదో
సానంద భాష్పాలు జాలువారు
నీ మందహాసాన ఏ మహిమ ఉన్నదో
పాషాణ హృదయంబు పరవశించు
నీ హస్తస్పర్శలో ఏ చలువ ఉన్నదో
తనువు పులకరించి ధన్యమగును
నీ పాదయుగళిలో ఏ బోధ యున్నదో
ఆత్మతత్వము మాకు అర్థమగును

గీ॥ కళ్ళుకావవి ప్రేమ వాకిళ్ళు స్వామి
నవ్వుకాదది గులాబి పువ్వు స్వామి
స్పర్శకాదది మీ పరామర్శ స్వామి
పాదములు కావు దివ్యబోధనలు స్వామి

సీ॥ పంచ భక్ష్యంబులు భక్షించిననుగాని
సంతృప్తిజెందని జన్మ మాది
భక్తి సూత్రములెల్ల వల్లెవేసినగాని
పరనిందమానని బ్రతుకుమాది
ముత్యాల రాసులు ముంగిటబోసిన
కొసరుకై చేజాచు గుణము మాది
అండగా బంగారు కొండవై నీవుండ
కల్ల పసిడికేడ్చు ఘనత మాది

గీ॥ చూడముచ్చటైన సుగుణంబులరుదైన
మమ్ము సంస్కరింప మనసు గలిగి
అవతరించినావు ఆశ్రితమందార
ప్రణతులందుకొనుము 'జ్ఞానబ్రహ్మ'

యతి జీవనం

స్వామి సుందర చైతన్యానంద



మతులు సరిపడితే లోకంలో అందరూ యతులే. యతివరేణ్యులే. సన్యాసము అనేది ఒక హోదా కాదు. అదొక జీవన విధానము. అన్నీ వదులుకొన్నవాడు సన్యాసి. అలాంటి వాడు ప్రపంచం నుండి ఏమి ఆశిస్తాడు? సన్యాసం పుచ్చుకొనే నాడే సన్యాసికి ఒక్క విషయం సుస్పష్టంగా తెలుసు. "నేను ప్రపంచం నుండి ఆశించదగింది ఏమీ లేదు. ఏదైనా అంగీకరించ వలసిందే"; ఇలా నిర్ణయించుకొనే సన్యాసాన్ని స్వీకరిస్తాడు.

తాను కనపడగానే లోకం విచిత్రంగా చూస్తుందని అతనికి తెలుసు. కనికరించి కబళం పడేసినా, తిట్టి పెట్టినా, పెట్టి తిట్టినా, అవి ఆశ్చర్యాలు కావు అని సన్యాసికి ముందే తెలుసు. ఏదో ఒక చెట్టు నీడ దొరికి, ఎంతో కొంత కడుపులో పడితే చాలు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కావలసిన దంతా తన మనస్సు లోనే ఉందని భావించి, ఉన్న అందరిని విడిచి, తాను ఒక్కడుగా మిగిలి పోవాలని సన్యాసి కాలు బైట పెడతాడు.

అంతకు మించి సన్యాసి ఏదీ ఆశించడు. కాని, అలాంటి సన్యాసికి ఏవేవో, ఎన్నెన్నో వచ్చి పడితే, చెట్టు నీడకు బదులుగా భవంతులు చుట్టేస్తే, పట్టెడు అన్నానికి బదులుగా పరమాన్నాలు ఎదురైతే, అవన్నీ పరమేశ్వరుని అనంత కృపకు నిదర్శనా లని భావిస్తాడే గాని, తాను రమించేందుకు సాధనాలని తలచి అనుభవించడు. ఇచ్చిన వాడికి తన మనస్సును ఇచ్చేసి, అతణ్ణి గూర్చే పలుకుతూ - పాడుతూ, పలకరిస్తూ - పులకరిస్తూ, కలవరిస్తూ - కలలు గంటూ కాలక్షేపం చేస్తూ ఉంటాడు.

యోగీ యోగ నియోజిత చిత్తః రమతే బాలోన్మత్తవ దేవ
భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే ॥

మనస్సును యోగమయం చేసి, పిల్లవాని వలె, పిచ్చివాని వలె **(ఉన్మత్తవత్)** సంచరిస్తూ ఉంటాడు.

ఇంతకీ, సన్యాసికి ఉన్న దేమిటి? లేని దేమిటి? ఏమో! కాని, ఒక్కటి మాత్రం సత్యం. సన్యాసికి ఏది ఉన్నా, అది తన మనస్సులో ఉందే గాని బయట లేదు. ఇది అర్థమైతే సన్యాసి ఎవరో, సన్యాస మేమిటో అర్థ మవుతుంది.

ఏదైనా భావం లోనే ఉంది. కాశికి వెళ్తే, అక్కడ గంగ ఉంటుంది. గంగలో పాలు

ఉండవు. నీళ్ళే ఉంటాయి. పాపాలు పోవడానికి పాలు అవసరం లేదు. నీళ్ళు చాలు.

సరే. గంగలో మనం మునక వేస్తాం. పాపం పోతుంది. బాగుంది. ఇంతకీ గంగా స్నానం చేసే సమయంలో మన పాపాల్ని పోగొట్టిం దెవరు? నీళ్ళేనా? నీళ్ళకు ఆ శక్తి ఉందంటారా? అదే పూర్ణ సత్యమైతే, మనకు ఒక్క నీటిబొట్టు అయినా దొరుకుతుందా?

నీళ్ళకు ఆ శక్తి లేదు. నీళ్ళలో స్నానం చేసే మనము సంకల్పం చెప్పి పాపాల్ని పోగొట్టు కుంటున్నాము అంటారా? అదే వాస్తవ మైతే, ఆ పని మనం ఎక్కడైనా చెయ్యొచ్చు. హుస్సేన్ సాగర్‌లో కూడా చెయ్యొచ్చు, శక్తి ఉంటే. బుద్ధుడు వద్దని వారించడు.

పాపాల్ని పోగొట్టే శక్తి నీళ్ళల్లో లేదు. నీళ్ళల్లో వసించే నారాయణునిలో ఉంది. గంగను తన విభూతిగా చూపే గంగాధరునిలో ఉంది. అది తెలిసి చేస్తేనే గంగాస్నానం పాపహరంగా, పుణ్యప్రదంగా శోభిస్తుంది. అంతా భావన లోనే ఉంది.

మనం అన్నం వండుతాము. నైవేద్యాన్ని వండలేము. బియ్యం ఉడికితే అన్నం అవుతుంది. పాలు, పంచదార, జీడిపప్పు, ద్రాక్ష, ఏలకులు, సగ్గుబియ్యము - ఇవన్నీ కలిస్తే పాయసం తయారవుతుంది. మరి, నైవేద్యంలో ఏవేవి వేయాలి? ఏవి కలిపితే నైవేద్య మవుతుంది? ఆలోచించండి.

నేను చెప్పనా? నైవేద్యం అనేది పదార్థం కాదు. ఏవి కలిపినా నైవేద్యం కాదు. నైవేద్య మనేది భావంలో ఉంది. భావం కలిపితే ఏ పదార్థమైనా నైవేద్య మవుతుంది.

అమ్మా! ఏం చేస్తున్నావు? అంటే, అబ్బాయికి అన్నం పెడుతున్నాను అని తల్లి చెబుతుందే గాని, నైవేద్యం పెడుతున్నాను అనదు. అలాగే భగవంతునికి నైవేద్యం పెడుతున్నాను అంటుందే గాని, దేవుడికి అన్నం పెడుతున్నాను అని చెప్పదు. ఎందుకని? అన్నం నైవేద్యం కాదు కనుక. భావం కలిస్తేనే నైవేద్య మవుతుంది. అందుకనే, మనం పెట్టేది తిరిగి మనకే వస్తుంది. అన్నం భావంతో కలిసి నైవేద్య మవుతుంది. భావాన్ని జనార్దనుడు గ్రహిస్తాడు (**భావగ్రాహీ జనార్దనః**). అక్కడే నైవేద్యం ప్రసాదంగా మారుతుంది.

భావం లేనపుడు నైవేద్యం లేదు. భావాన్ని భగవంతుడు గ్రహించ నపుడు ఇక అక్కడ అన్నమే ఉంది. ప్రసాదం లేదు. అన్నమైతే ఆకలిని తీర్చుతుంది. ప్రసాదమైతే ఆకలిని తీర్చడమే కాదు, ప్రశాంతతను కూడా ప్రసాదిస్తుంది (**ప్రసాదేతి ప్రసన్నతా**). ప్రశాంతత అంటే దుఃఖం లేకుండా ఉండటమే గదా! ప్రసాద భావంలో సమస్త దుఃఖాలు నశిస్తాయి (**ప్రసాదే సర్వ దుఃఖానాం హానిః వినాశః అస్య యతేః ఉపజాయతే**).

భావం ఉన్నచోట విభూతి దర్శనం జరుగుతుంది. అది ఎవరి విభూతి? ఈశ్వర విభూతి. జగదీశ్వర విభూతి. ఇది అర్థమైతే, జగన్నాథ రథచక్రాలు చలిస్తాయి. జగత్తు జగన్నాథుడుగా దర్శన మిస్తుంది. బ్రతుకు భగవన్మయ మవుతుంది.

ఇలా జీవించేవా రందరూ యతులే. సన్యాసులే. ఏది ఉంది? ఏది లేదు? అని మదింపు వేసే దుర్గతి ప్రపంచానిది. కలిమి లేములను ప్రక్కకు నెట్టి, భావసంపదతో జీవించే సద్గతి సన్యాసులది.

నమో, దైనమో!

శ్రీ వాకాటి పాండురంగా రావు,
మాజీ డిప్యూటీ ఎడిటర్
"ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక

కొన్నేళ్ళ క్రింద, ఒక ఆదివారం సాయంకాలం. మామూలుగా ఆదివారం అయితే ఇల్లు కదలని నేను, సికింద్రాబాద్ నుండి బస్సెక్కి టాంక్‌బండ్ దగ్గర దిగాను. దారి పొడుగునా అక్కడక్కడ "స్వామి సుందర చైతన్యానంద ప్రసంగం" అన్న పోస్టర్లు చూశాను.



బస్సు దిగాక ఒక గోడ మీద పోస్టర్‌ని దగ్గరగా చూశాను. ఏ.వి.కాలేజి అని ఉంది. దగ్గరే ఉండాలి అని కనుక్కుని వెళ్ళాను.

ఆ కాలేజి మైదానం తోరణాలతో కళకళ లాడుతోంది. లౌడ్ స్పీకర్‌లలో నుంచి **"మస్తమ్ మస్తమ్ మధుర నినదై ర్వేణు మాపూరయన్తమ్"** అన్నట్లుగా భక్తిగీతాలు గాలిలో తేలుతూ చెవులను తాకాయి. కుడి వైపు పుస్తకాల కౌంటరు. దాని నిండా రకరకాల ఆధ్యాత్మిక విషయాల మీద స్వామి వారి పుస్తకాలను వాలంటీర్లు అమ్ముతున్నారు.

"ఇదేదో పెద్ద వ్యవహారమే", అన్పించింది. కొన్ని పుస్తకాలు కొన్నాను. వెళ్ళి జంపకానా మీద ఒక ప్రక్కగా కూర్చున్నాను. అరగంటలో మైదానం నిండిపోయింది. వేదిక మీద ఆర్భాటమైన అలంకరణ. పుస్తకం తిరుగ వేస్తున్నాను.

వేళయింది. వేదిక ప్రక్కగా కారాగింది. చకచక నడచుకుంటూ వేదిక నెక్కాడా స్వామి.

చూశాను.

బలమైన పొడవాటి ముఖం. మెరిసే కళ్ళు. తలకో కాషాయాంబరం. నడవడంలో, కూర్చోవడంలో, శ్రోతలను అవలోకించడంలో ఒక రాజసం. ఒక విలక్షణత.

'ఓం' అన్నది వెయ్యివీణలు మంద్రస్థాయిలో మీటి నట్లున్న ఆయన గొంతు.

ప్రార్థన, భజన, ప్రసంగం. కాలం తెలియలేదు. మాటలు - హిమవత్ పర్వత సానువుల నుండి ఉరకలు వేస్తూ వచ్చే అలకానంద గలగలలు!

మందలింపులు - హెచ్చరికలు - దారి తప్పుతున్న బిడ్డలను దారికి మళ్ళిస్తున్నంత కాఠిన్యరేఖలు!

విమర్శలు - గురి తప్పని బాణాలు! గీతాలు, మాధుర్య లాలిత్యాపాతాలు - హఠాత్తుగా ముగిసింది. అదే వేగంతో నిష్క్రమణ. ఈయనను మళ్ళీ వినాలి - అంది మనస్సు. మరుసటి రోజు అదే అనుభవం.

ప్రవచనం అయ్యాక ఆయన కారెక్కారు. దాని చుట్టూరా భక్తులు. నేను నా చేతిలో వున్న "దిక్సూచి" పుస్తకం ఎలాగో ఓలాగు కారు కిటికీ లోకి జారవిడిచాను. ఆపాటికే

కారు వేగం పుంజుకుంది.

సికింద్రాబాదు పి.జి. కాలేజీ గ్రౌండ్స్‌లో భాగవత ప్రవచనం.

అసలే అది భాగవతం. రాసినవాడు మాటల కలకండల పోతన. ఆర్ద్రతతో, ఆవేశంతో, అర్థగాంభీర్యంతో, అనిమిషులు తలలూపే మార్దవమైన గానంతో ఆ భాగవతాన్ని స్వామి సుందర చైతన్యానంద చెబుతుంటే వినడం చెవులకు, మనసుకు పెద్ద పండగే.

కృష్ణుడు నుండి కబీరు దాకా, స్తోత్ర రత్నావళి నుండి నిర్గుణ మానసపూజ దాకా శ్రీ సుందర చైతన్యులు వ్యాఖ్యానించని సనాతన సాహిత్యాంశం లేదేమో? అనిపించింది.

ఒక వైపు ప్రసంగాలు, ఇంకో వైపు పర్యటనలూ, మరొక వైపు రికార్డింగులు, హైదరాబాదులో టి.వి. ద్వారా తరగతులు, గీత పుస్తకాలు - ఈయన కాలెండరు లోనూ సంవత్సరానికి మూడువందల అరవై రోజులే కదా? రోజుకు 24 గంటలే కదా?

"భక్షిస్తూ కూర్చుంటే
భక్షింపబడుట తప్పదు.
కుక్షిని చల్లగా వుంచు.
అక్షిని మెల్లగా కదిలించు.
అడుగులు ముందుకు వేయి.
పిడుగులు పడినా వెనుకాడకు" అంటారాయన.

ఆ బాటలలో తాను జీవిస్తూ అది గమనించలేని మనకు మళ్ళీ వివరించి చెబుతూ, చెప్పింది మరిచిపోతారేమో నని అచ్చు పోసిన అక్షరాలు మన ఎదుట వుంచుతున్నారు.

ఇది పుణ్యభూమి. మనది సనాతన ధర్మం.

భూగోళం యింకా గోచీ కట్టడం నేర్వక ముందే దైవం మనుషుడై సంచరించిన అపురూపమైన మట్టి ఇది. ఆరని జ్ఞానదీపం ఇది.

అయితే నేమి! దీపం క్రిందనే చీకటి వున్నట్లు మనం గ్రుడ్డివార మయ్యాం. పొరపాట్లు చేస్తున్నాం. కరుణ, త్యాగం, సేవ, జ్ఞానం లాంటి వాటిని చిలకల్లా పలుకుతుంటాం తప్ప ఆచరించము. స్వామికి దండం పెడితే చాలు; ఆయన మాటలు వింటే చాలు; ఆచరించక పోయినా ఫర్వాలేదు అనుకునే అజ్ఞానం మనది!

అందుకనే ప్రతి శతాబ్దం లోనూ బధిరాంధక శవాలైన మనకు ప్రాణం పోయటానికి ఎందరో మహానుభావులు పుట్టారు. మన చెవి నిల్లు కట్టుకుని పోరారు. ఆ పుణ్యగంగా తరంగాలలో ఒక్కటి ఈ చైతన్య వాణి.

"నడిచే దారి
కదిలే కాలు
పారే నీరు" అంటాను సుందర చైతన్యానంద స్వామి.

ఆ క్రియా శబ్దాలు గమనించండి.

అన్నీ చైతన్యం నిండినవే. మన వెంటపడి, పాటల బెత్తం పుచ్చుకుని తరుముతున్న ఆధ్యాత్మిక డైనమో ఈయన! **నమోన్నమః**

అచ్యుతుడే అందరికీ తోడు

స్వామి సుందర చైతన్యానంద



చేయవలసింది ఉండినా చేసే శక్తి లేనపుడు చేయగలిగింది ఏమీ ఉండదు, చేయలేక పోతున్నాను అనే బాధ తప్ప. చేసే శక్తి ఉన్నా, చేయవలసింది ఎదురు చూస్తూ ఉండినా, సోమరితనం వల్లనో, సంస్కారాల ప్రభావం వల్లనో, అవగాహనలో స్పష్టత లోపించడం వల్లనో చేయడం మాని చేతులు కట్టేసుకొని కూర్చుంటే జీవితంలో ఏమీ మిగలదు, అశాంతి ఆవేదన తప్ప.

చేయవలసింది ఉంది కనుకనే భగవంతుడు చేతులిచ్చాడు. చూడవలసింది ఎంతో ఉంది కనుకనే కళ్ళిచ్చాడు. ఆలోచించవలసింది కూడా ఎంతో ఉంది కనుకనే మనిషికి మనసిచ్చాడు. నిజం చెప్పాలంటే, ఈ ప్రపంచంలో శక్తి లేనివాళ్ళు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు, ఉపేక్షించదగిన సంఖ్య అనే చెప్పొచ్చు. శక్తి ఉండి వినియోగించుకోలేని వాళ్ళే ఎక్కువమంది.

ఏదీ చెయ్యకుండా, ఏమీ చెయ్యకుండా నేను ఏ తప్పు చేయలేదు అని డప్పు వాయించుకొనే దద్దమ్మల కన్నా, చెయ్యవలసిన దానిని సరిగా చేయలేక పోయినా, కొన్ని సమయాలలో తప్పులు దొర్లినా, చేసేందుకు నడుము బిగించిన వాళ్ళే యోగ్యులు. చేసిన తప్పును సరిచేసుకొనే అవకాశము చేసే వానికి ఉంటుందే కాని, ఏదీ చెయ్యని వానికి లభించదు.

అలాగని చేయవలసింది ఉంది కనుక మనస్సులో ఉత్సాహం లేకుండా చేస్తూపోతే, అలాంటి పనులలో నాణ్యత లోపించి, సౌందర్యం నశించి, చివరగా నైరాశ్యమే దర్శనమిస్తూ ఉంటుంది. నీవు లేకుండా నీవు చేసే పనిలో అందం ఉండదు, ఆనందం మిగలదు. ప్రాణం లేని దేహం లాగా ఉంటుంది.

ఉత్సాహంతో చేస్తేనే కర్మలు ఉత్సవాలుగా శోభిస్తాయి. ఉత్సాహంతో చేయాలి అంటే జ్ఞానం ప్రధానంగా ఉండాలి. జ్ఞానం లేకుండా ఆచరించే కర్మలు నిరుత్సాహానికి నిలువుటద్దాలై నిలుస్తాయి.

శ్రీరాముడి ఫోటో నీకు కనిపించింది. రెండు చేతులు జోడించి నమస్కరించావు. ఎందుకు అలా చేశావు? ఫోటోలో వైభవ ముందా? ఉందో లేదో అది వేరే విషయం.

చిత్రంలో ఉన్న విచిత్రానికి కాదు నీవు నమస్కరించింది. నీ చిత్తంలో ఆ చిత్రానికి సంబంధించి నిక్షిప్తమై ఉన్న జ్ఞానమే నిన్ను అలా నమస్కరించేలా చేసింది.

వికసించిన మల్లెలలో సువాసనను వ్యక్తం కాకుండా ఆపలేము. వివేకం కూడా అంతే. బుద్ధి యొక్క వికసనం కర్మలలో దివ్యంగా ప్రకాశిస్తుంది. సంగీత జ్ఞానం కలిగి, శ్రావ్యమైన కంఠానికి నోచుకున్న విద్వాంసుడు ఆలపించకుండా ఉండలేడు. ఆలపించడంలో ఆనందించకుండా ఉండలేడు. ఇదే కర్మలలో సౌందర్యం. జ్ఞానం కలిగిన వ్యక్తి యొక్క కర్మలలో శోభించే నిత్యసౌందర్యం.

తుమ్మును, దగ్గును ఎలా ఆపుకోలేమో, నవ్వును కూడా ఆపుకోలేము. భావం లేకుండా మనిషి నవ్వలేడు. భావం మనస్సులో ఉంది. బాహ్యంలో నవ్వు వ్యక్త మవుతూ ఉంది. అలాగే కర్మలలో సౌందర్యం ఉందంటే, భావంలో జ్ఞానం సుందరంగా శోభిస్తూ ఉంది అని అర్థం.

ఆత్మ ఆనంద స్వరూపము. అనంతానంద స్వరూపము. ఆత్మజ్ఞానము బుద్ధిలో ఏర్పడితే, బ్రతుకులో ఆనందమే తాండవిస్తూ ఉంటుంది. కర్మలలో సౌందర్యమే తొంగి చూస్తూ ఉంటుంది.

అనాత్మకు సంబంధించిన ఆలోచనలు ఆంతర్యంలో కదులుతూ ఉంటే, కర్మలలో స్పష్టత లోపించి అహంభావన తొంగిచూస్తుంది. అహంభావన స్వార్థపూరితమైన కర్మలకు కారణ మవుతుంది. రాగద్వేషాలు అక్కడ నుండే విజృంభిస్తాయి.

అర్థరహితమైన ఆలోచనలు మనసును ఆవేదనకు గురి చేస్తాయి. భావాలు సున్నితంగా ఉండాలి. ఇదే భావసౌందర్యం. బరువైన భావాలు బ్రతుకులో భారాన్ని పెంచుతాయి. ఆనందాన్ని దూరంగా ఉంచుతాయి.

ఏదో లేదని బాధపడుతూ ఉంటాము. ఉన్నదానికి మనం ఎంత కృతజ్ఞతతో ఉన్నామో ఆలోచించుకోవాలి. ఈ ఒక్కటి అర్థమైతే, ఈ ఒక్క పని చేయగలిగితే బ్రతుకు అందమైన మలుపు తిరుగుతుంది.

ఏదో లేదని బాధపడటం సరే, అలా ఉంచండి. ఉన్నది మనకు ఎవరిచ్చారు? ఇచ్చినవాడు ఈశ్వరుడే అనేది అర్థమైతే, మనకు రావలసిందే వచ్చింది అని అర్థం. అదే మనకు కావలసింది అని అర్థం చేసుకోవాలి. మన అర్హతను బట్టే ఏదైనా మనకు అందుతుంది.

ఉన్నతమైన భావాలతో, త్యాగపూరిత మైన జీవితాన్ని కొనసాగిస్తూ, ధ్యానపూరిత మైన హృదయంతో సద్భావనాపూరిత కర్మల్ని ఆచరిస్తూ పోగలిగితే, జీవితాలలో ఉత్సవ వాతావరణాన్ని వీక్షించవచ్చు. నా విషయాని కొస్తే, నేను సహజంగా నవ్వుతుంటాను. నవ్విస్తూ ఉంటాను. ఎన్ని బాధలు చుట్టుముట్టినా, నవ్వును నేను పారేసుకోలేదు. నైరాశ్యంతో కుమిలి పోలేదు. బ్రతుకులో పారిపోలేదు. బాధల్ని భరిస్తూ ఉండినా, నిముషాల్లోనే నవ్వుకు పెద్ద పీట వేసేవాణ్ణి.

నేను దేనిని ఊహించి, అది రాలేదని బాధపడాలి? ఉన్నది వదలి, ఉన్నవారిని విడిచి సాధుజీవనాన్ని ఇష్టపడి ఎంచుకున్నాను. ఒంటరిగా బయలుదేరాను. ఏం జరుగుతుందని ఆ రోజుల్లో ఊహించి ఉంటాను? ఏ ఆధార ముందని ఆశలు కదుల్తాయి? ఏ అవకాశ ముందని ఊహలు మెదుల్తాయి?

ఎవరివీ కాని చెట్లు ఈ విశాల ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. ఏదో ఒక చెట్టు నాకు నీడ నివ్వకపోతుందా? ఎందరికో చోటిచ్చిన భూమాత, అందరినీ భరించే పుడమితల్లి ఒక్క శిశువుకు తన ఒడిలో స్థానం లేదంటుందా?

గాలికి రాజు పేద అనే తేడాలు లేవు కదా! నీటికి నా, నీ అనే భేదం తెలియదు కదా! ఇంకేమి? అలాగే బ్రతికేస్తాను. జానెడు పొట్టను నింపుకొనేందుకు దిగులెందుకు? ఏ ఇంటి ముందైనా నిలబడి అడుక్కోవడానికి పుట్టించినవాడు ఎలాగూ బారెడు చేతుల్ని జోడించాడు. 'మాతా! భిక్షాందేహి' అని అడగలేక పోవటానికి మూగవాణ్ణి కాను. ఈ భావాల తోనే నేను బయలుదేరాను. మూడు దశాబ్దాలు దొర్లిపోయాయి. ఏం జరిగిందో, ఏం జరుగుతూ ఉందో ఇద్దరికే తెలుసు. ఆ ఇద్దరిలో నేను ఒకణ్ణి. రెండవవాణ్ణి గురించి ప్రత్యేకంగా చెప్పేందుకు ఏముంది? నేను నోరు తెరిస్తే పలికేది అతణ్ణి గురించే కదా!

స్వామీజీ! ఆశ్రమం ఎంత అందంగా ఉంది! ఎంత సుందరమో! అంటుంటారు భక్తులు. స్వామీజీ! మీ నుండి ఎంత వేదాంత జ్ఞానం, ఎన్ని పుస్తకాలు అందాయి. ఇవన్నీ సమాజానికి పరమేశ్వరు డిచ్చిన వరాలుగా భావిస్తున్నాం అని మొన్ననే అనంతపురం నుండి నన్ను చూడటానికి వచ్చిన ఒక వృద్ధ పండితుడు అన్నాడు.

ఇలా రోజూ ఎన్నో ప్రశంసలు వింటూనే ఉంటాను. ఎవరు ప్రశంసించినా, లేదా విమర్శించినా నేటి జీవితాన్ని మదింపు వేసుకొనే మాట్లాడుతారు. నన్ను అవి పెద్దగా స్పృశించలేవు. నా జీవితంలో ఏం జరిగిందో నాకే తెలుసు. ఏం జరిగింది? అని మీరు అడగవచ్చు. నేను చెప్పలేను. చెప్పాలనే ఆసక్తి కూడా నాకు లేదు.

కాని, ఒక్క మాట మాత్రం చెప్పగలను. మనకు దేహాన్ని, మనస్సును, మనుగడను ప్రసాదించి, నిరంతరం మన ప్రాణానికి ప్రాణమై, జీవానికి జీవమై శోభించే పరమేశ్వరుని యందు అకుంఠితమైన భక్తి, అచంచలమైన విశ్వాసము ఉంటే, ప్రారబ్ధము బాధల్ని పంచుతున్నా, బోధలతో భగవంతుడు మనల్ని ఉన్నతంగా పెంచుతూనే ఉంటాడు; ఆనందంలో ముంచుతూనే ఉంటాడు అని మాత్రం నిస్సందేహంగా చెప్పగలను. ఈ విషయంలో అనుభవం శాస్త్రానికి దూరంగా లేదు. శాస్త్రం అనుభవాన్ని దూరం చేయడం లేదు.

ఆత్మబంధువులారా! కానివ్వండి. ఆనందంగా సాధనలో ముందుకు సాగుదాం. మనసులో మాధవుడే ఉండేలాగ చూసుకుందాం. జనం చేరితే జనరంజకంగా మసలు కుందాం. ఒంటరిగా ఉంటే శాస్త్ర వాక్యాలలో దొర్లుతూ ఉందాం. జపంలో సాగుతూ

ఉందాం. ధ్యానంలో కొనసాగుతూ ఉందాం. పూజిస్తూ, కీర్తిస్తూ, స్మరిస్తూ ప్రతిక్షణానికి ప్రాణం పోద్దాం.

మనం ఆశించింది రాకపోవచ్చు. అర్హత కలిగిన దానిని రాకుండా ఆపే శక్తి ఎవ్వరికీ లేదు. ఎవరి అవసరం ఎవరికీ లేదు ఈ ప్రపంచంలో. అందరికీ ఈశ్వరుడే అవసరమై ఉన్నాడు.

ఈర్ష్యాసూయల ఊయలలో ఈశ్వరుని కూర్చోబెట్టి ఊపడం ఎవరికీ సాధ్యం కాదు. రాగద్వేషాలతో నిండిన బుద్ధిలో రాముడు ఊరేగలేడు. క్రోధాల కోలాహలం మధ్య నిలబడి కృష్ణుడు మురళిని ఊదలేడు.

స్వప్నంలో ఎవరున్నా, ఏమున్నా, మేలుకొంటే మనమే ఉన్నాము. స్వప్నంలో మనము లేమా? మనమే లేకపోతే స్వప్నమెలా ఉంటుంది? స్వప్నంలో మన మున్నాము. మేలుకున్న తరువాత మనమే ఉన్నాం.

స్వప్నప్రపంచం అసత్యం. అసత్యమైన స్వప్నప్రపంచంలో చిక్కుకు పోయిన సత్యరూపులం మనం. మేలుకోగానే స్వప్నంలో ఉన్న మనం లేము. మనమైన మనమే ఉన్నాము.

రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, కామక్రోధాలు, అహంకార అభిమానాలన్నీ స్వప్న తుల్యాలు. సత్యదూరాలు. అవి ఉన్నంతవరకు జీవభ్రాంతితో ఉంటాము. అవి తొలగిపోతే, వాటితో నాట్యం చేస్తున్న మనం కూడా లేము.

ఇక ఎవరుంటారు? ఈశ్వరుడే ఉంటాడు. పరమేశ్వరుడే ఉంటాడు. మనలో 'అహం భావన' ఎంత చిన్న దవుతూ ఉంటే, మనలో ఈశ్వరుడు అంత పెద్దగా శోభిస్తూ ఉంటాడు.

బ్రతుకును ఇలాగే భగవన్మయం చేసుకోవాలి. ఈశ్వరార్పణం గావించాలి. ప్రయత్నిద్దాం కానివ్వండి.

అపిచేత్సు దురాచారో భజతే మా మనన్యభాక్
సాధురేవ సమన్తవ్యః సమ్య గ్వ్యవసితో హి సః ॥

అర్జునా! చాలా చెడ్డ ప్రవర్తన కలిగిన వాడైనా ఎవడైతే, అనన్యభక్తితో నన్ను సేవిస్తాడో అట్టివాడు సాధువే నని గ్రహించాలి. ఎందుకో తెలుసా! అతడు మంచి నిశ్చయముతో ఉన్నాడు కనుక, అని దివ్యబోధ గావించాడు భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ.


నమ్మి చెడ్డవాళ్ళు లేరు. నడచి చేరని వాళ్ళు లేరు. ఎవరూ ఒంటరివాళ్ళు కారు. అందరికీ అచ్యుతుడే తోడు.

దిక్కు తోచక దిగులుతో ఉండిన వాళ్ళం. దిక్కైన పరమేశ్వరుని హక్కుగా పొంది, భక్తిలో దిగినాము. మునిగితే తరించి పోతాం. తేలితే తరింప చేస్తాం. ఇక ఆలస్య మెందుకు? ఆలోచన ఎందుకు? పదండి. నవ్వుతూ యాత్ర సాగిద్దాం.

కళ్యాణ పథం

స్వామి సుందర చైతన్యానంద

భూమి సారవంత మైనపుడే బీజం మొలకెత్తుతుంది. భావన పవిత్ర మైనపుడే కర్మకు పూర్ణత్వం సిద్ధిస్తుంది. హృదయం శుద్ధిపడి నపుడే శాంతిప్రేమలు శోభిస్తాయి. ప్రేరణ కలిగితేనే హృదయం స్పందిస్తుంది.



నేటి సమాజంలో అందరికీ ప్రేరణ కావాలి. జీవిత లక్ష్యానికి సంబంధించిన అవగాహన ఏర్పడాలి. కానీ ప్రేరేపించే వ్యక్తులు బాగా తగ్గిపోయారు. చేపలు లేని సరస్సు శుభ్రంగా ఉండలేదు. స్ఫూర్తి నిచ్చే వ్యక్తులు లేని సమాజం పవిత్రతకు నోచుకోదు.

నిశ్చలంగా ఉన్న నీటిపై గాలి వీచినపుడు అల కదుల్తుంది. దాని చలనానికి మరొక అల కదుల్తుంది. అది తిరిగి మరొక అలను కదిలిస్తుంది. ఇలా ఒకదాని తరువాత మరొకటి కదులుతూ తీరాన్ని చేరడం జరుగుతుంది. దీనినే **వీచీ తరంగ న్యాయము** అంటారు. ఈ న్యాయాన్ని అనుసరించకపోతే నేటి సమాజమును అన్యాయం నుండి రక్షించడం కష్టం. అధర్మం నుండి మరలించడం దుస్సాధ్యం.

వెలిగే దీపము మరొక దీపాన్ని వెలిగించినట్లు, పవిత్ర జీవనానికి నోచుకున్న పుణ్యాత్ములు మరి కొందరిని పవిత్రులుగా మార్చాలి. సంతృప్తి చెందిన వారు మరికొందరికి తృప్తిని పంచే కార్యంలో నిమగ్నం కావాలి.

అందము ఉంది. విద్య ఉంది. ఆర్థిక సంపద పుష్కలంగా ఉంది. పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఆయుషు లేకపోతే అన్నీ ఉండి ఏమి ప్రయోజనం?

ఆయుర్దాయానికి వ్యయమే గాని ఆదాయం తెలియదు. నదిలో ముందుకు పోయిన నీరు వెనుకకు మరలిరాదు. గతించిన ఆయుషు తిరిగి ప్రభవించదు.

ఉన్నంతలో ఉన్నతిని సాధించాలి. భావాలతో బ్రతుకును భవ్యంగా దిద్దుకోవాలి. బ్రతుకును ప్రతిక్షణము పవిత్రం చేసుకోవాలి. **"వీచీ తరంగ న్యాయము"**ను జీవితంలో ధ్యేయంగా పెట్టుకోవాలి.

దివ్యమైన భావాలతో ప్రభావితమైన వారు మరి కొందరి హృదయాలను ప్రేమతో స్పృశించాలి. మనం ఎలా స్ఫూర్తిని పొందామో వారికి తెలియజేయాలి. మన వద్ద ఉన్న పుస్తకాలను వారి చేత చదివించాలి. తల్లి బిడ్డకు ఉగ్గుపాలను పట్టించినట్లు, ప్రేమతో వారి మనస్సులకు భవ్యమైన భావాలను పట్టించాలి. ప్రయత్నశీలురకు ఈ ప్రపంచంలో అసాధ్యమంటూ ఏదీ లేదు. ఇది సత్యం. సత్యం. ముమ్మాటికీ సత్యం.

గదిలో దీపం వెలుగుతూ ఉంది. కిటికీలు, తలుపులు మూసేస్తే వెలుగు లోపలే ఉంటుంది. తలుపులు తెరిస్తే వెలుగు బాహ్యానికి కూడా విరజిమ్మ బడుతుంది. ఆ వెలుగు చాలా మందికి ఉపకరించవచ్చు. అలా చేయడం వల్ల మనకు నష్టం లేదు. ఇంధనం ఖర్చు పెరగదు. ఏ ఒక్కరికి ఉపయోగపడ గలిగినా మనస్సులో ఏదో ఒక మూల చల్లని వెన్నెల కురుస్తూ ఉంటుంది.

బుద్ధిలో మంచి మంచి భావాలు ఉండాలి. వాటిని లోపలే దాచుకోకుండా పది మందికి పంచే సదలవాటు చేసుకోవాలి. మంజులమైన భావాలు వినేవారి హృదయాల్ని చలింప చేస్తాయి. మనోజ్ఞమైన జీవనబాటకు దారి చూపుతాయి.

ధనవంతులు పెద్ద పెద్ద భవనాలు నిర్మించుకొని జీవిస్తారు. ధనం లేని వారు వారి స్థాయికి తగినట్లు చిన్న ఇల్లు కట్టుకొని కాలం వెళ్ళబుచ్చుతారు. నివసించడానికి ఇల్లు కావాలి. ఉండాలి. అది ఎలా ఉండాలి? ఎంతదై ఉండాలి? అనేది వారి వారి స్థాయిని బట్టి ఉంటుంది.

పాండిత్యమున్న వారు పెద్ద పెద్ద గ్రంథాలు రచించి అశేష ప్రజానీకానికి విశేషంగా సేవలు అందించవచ్చు. పెద్ద పాండిత్యము లేకపోయినా, తమకు ఉన్న జ్ఞానంతో సామాన్యులు కూడా భావ సుమాల్ని పంచవచ్చు. మనం వ్రాసే ఉత్తరాలలో ఎక్కడో ఒకచోట సందర్భాన్ని బట్టి ఒక అందమైన భావాన్ని అందించవచ్చు. అదొక సూక్తి కావచ్చు. పఠించే వారిలో అదే స్ఫూర్తిని నింపవచ్చు.

జ్ఞానమున్న వారు తమ ప్రసంగాల ద్వారా వేలాది మందిని చైతన్యవంతుల్ని చేయవచ్చు. ఆ పని చేయలేని వారు మనం కలిసే వ్యక్తులకు, మనల్ని కలిసే వ్యక్తులకు సంభాషణల మధ్య సద్భావాలను పంచుతూ పోవచ్చు. ఇష్టమైన వారికి ఒక పువ్వు నందించి తృప్తి చెందుతాం. ఇచ్చిన వారికి, పుచ్చుకున్న వారికి అదొక తాత్కాలికమైన తృప్తి నిస్తుంది. కాని, భావసుమాన్ని అందిస్తే, అది వాడదు సరికదా, నిత్యము పరిమళాన్ని వెదజల్లుతూ బ్రతుకును సుగంధ భరితం చేస్తుంది.

ప్రపంచం తీరుతెన్నులు శరవేగంతో మారిపోతున్నాయి. విలువలు సెలవులు పుచ్చుకుంటున్నాయి. కారుణ్యాలు తెరుమరుగై, కాఠిన్యాలే తెర మీద కొస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, సమాజంలో సమభావం సమసిపోతుంది. వికృత విషమ స్థితి దృఢంగా నాటుకుపోతుంది.

విలువలపై విలువ ఉన్నవారు విలువలను విరివిగా పంచే విలువైన కార్యానికి వెంటనే నడుం బిగించాలి. ధన మిస్తే మనిషి పాడు కావచ్చు. జ్ఞానాన్ని పంచితే మనిషి పాడు కాడు సరి కదా, ఊహించని రీతిలో బ్రతుకును సరిచేసుకొని బాగుపడతాడు. ఇదేదో వేదాంతం అనుకోవద్దు. సమాజంలో దౌర్జన్యాలు అంతరించి, సౌజన్యాలు అలరారాలని, సహృదయంతో, సామాజిక స్ఫూర్తితో స్పందించే హృదయం వితరణ చేస్తున్న ప్రసాదం. అంతే!

తమసోమా జ్యోతిర్గమయ

మనసును జయిస్తే మహిని జయించినట్లే

స్వామి సుందర చైతన్యానంద

మనసు పాడైన తరువాతే మనిషి పాడవుతాడు. మనుగడ పాడవుతుంది. బోధలు వంట పడితే బ్రతుకులో బాధలు కంట పడకుండా పోతాయి.

మనసు దేనినైనా కోరుకోవచ్చు. ఆ శక్తి మనసుకు ఉంది. కాకపోతే, మనసు కోరేది మనకు అవసరమా? కాదా? అనేది నిర్ణయించ వలసింది మనమే గాని మనసు కాదు. మనకు ఏది మంచిదో దానిని మనస్సు కోరలేక పోవచ్చు. కాని, మనస్సు కోరుకునే వాటిలో ఏది మనకు మంచిదో దానినే మనం ఆశించాలి.

అనుభవానికి అందిన, అందుతున్న విషయాలనే మనసు ఆలోచించ గలుగుతుంది. మన అనుభవాలన్నీ అందమైనవని, ఆనంద ప్రదమైన వని చెప్పలేము. మన ఆలోచనా విధానంలో తయారైన దృఢ సంకల్పాలే అనుభవాలు.

ముక్కు వాసనను గ్రహిస్తుంది. అది మల్లెల వాసన అనే విషయాన్ని మనస్సు తెలుసుకుంటుందే గాని ముక్కు చెప్పలేదు. ఆ వైపుగా వెళ్ళి మనం మల్లెలను కోస్తే, దానికి కారణం మనసే గాని ముక్కు కాదు. ఏదైనా అంతే. కళ్ళు రూపాల్ని చూచినా, చెవులు శబ్దాలను విన్నా, అవన్నీ పరికరాలు మాత్రమే. పనితన మంతా మనసుదే.

కళ్ళు చూచిన ప్రతి వస్తువు వెంట మనసు పరుగుపెట్ట నవసరం లేదు. కాని, మనసు చూడాలనుకున్న దానిని చూడకుండా ఆపే శక్తి కంటికి లేదు. చూచేందుకు కళ్ళు ఉపయోగ పడవచ్చు. చూడవలసింది మాత్రము మనసే.

నేత్రాది ఇంద్రియాలకు ఏవేవో అందుతూ ఉంటాయి. అవన్నీ మనసుకు అవసరం లేదు. కనుక ఇంద్రియాలను మనస్సు అనుసరించ నవసరం లేదు. మనస్సుకు అవసర మైనవి ఏవో, వాటి వైపు ఇంద్రియాలు నడుస్తాయి. అయితే, మనస్సు సంకల్ప ప్రవాహమే కనుక, మనకు ఏమి కావాలో దానిని మనసు నిర్ణయించ లేదు. మనం నిర్ణయించాలి.

మనస్సును బట్టే నేత్రాది ఇంద్రియాలు ప్రవర్తిస్తాయి. అవసరం లేనివి మనస్సులో చేరకుండా మనం చూసుకోవాలి.

మాయ లేడిని చూచింది మాయ లెరుగని సీతమ్మ. సుందరమైన, సువర్ణమయ మైన లేడి చర్మము సీతమ్మ మనస్సును ఆకర్షించింది. హరిణి చర్మ సౌందర్యాన్ని చూచి తరుణి చిత్తం పాడై పోయింది అన్నాడు వాల్మీకి **(చర్మణా హృత చేతనా)**. చర్మ సౌందర్యం ఆమె మనసును హరించింది.

మనసు హరింప బడిన తరువాతే మగువ అపహరించ బడింది. మాయలేడి ఆశించ దగింది కాదని రామలక్ష్మణులు చెప్పినా సీతమ్మ వినలేదు. అందమైన లేడితో ఆడుకోవాలని సీతమ్మ ఆశిస్తే, ఆమె బ్రతుకు తోనే ఆడుకోవాలని రావణుడు అభిలషించాడు. సీతమ్మ జీవితం బాధల్లో చిక్కుకు పోయింది.

బోయవాడు పన్నిన వలలో పక్షులు అమాయకంగా దిగుతాయి. తమకు తాముగా తయారు చేసుకున్న కోరికల వలలో దూరి మానవులు పరితపిస్తూ ఉంటారు. విలువలు తెలియని వలపులన్నీ ఈ ప్రపంచంలో బంధించే వలలే. కలతల కలలే. కలల ప్రపంచంలో పలవరింతలన్నీ పరితాపాలే. కలవరింతలన్నీ కన్నీళ్ళే.

బంగారు లేడిని కళ్ళు చూడటం తప్పు కాదు. తప్పదు కూడా. కాని, అది ఆశించ దగినదా, కాదా అని మదింపు వేయగల శక్తి మనసుకు ఉంటే బ్రతుకు బాధల సుడిగుండంలో పడదు.

సీతాన్వేషణ సమయంలో ఆంజనేయస్వామి రాత్రిపూట ఆదమరచి నిద్రిస్తున్న రావణుని భార్యలను చూశాడు. విశేష సౌందర్యం గల వనితలు తొలగిన వస్త్రాలతో నిద్రిస్తున్న దృశ్యాలను కూడా చూశాడు. అయినా, తన మనస్సు వికారం చెందలేదు అంటాడు హనుమంతుడు.

కామం దృష్టా మయా సర్వా విశ్వస్తా రావణస్త్రియః।
న హి మే మనసః కించిత్ వైకృత్యం ఉపపద్యతే॥

స్వేచ్ఛగా నిద్రిస్తున్న చాలా మంది స్త్రీలను నేను చూచింది వాస్తవమే. అయినా, నా మనస్సులో ఎట్టి వికారము కలగలేదు అన్నాడు ఆంజనేయస్వామి.


కళ్ళు చూచినా మనస్సు వాటిని అనుసరించ లేదు. ఈ విధమైన వివేకం ఉన్న వాళ్ళందరూ హనుమంతులే అవుతారు. మనస్సును జయించినవాడు ప్రపంచాన్నే జయించ గలడు. పర్వతాల్ని పెకలించ గలడు. సాగర చలనాన్ని నిరోధించ గలడు. వాయువేగాన్ని ఆపగలడు. అగ్ని తేజాన్ని చల్లబరచ గలడు. ఇవన్నీ చేసి చూపాడు మనసును జయించిన మారుతి. మనసును అదుపు చేయలేక మైథిలి మారణహోమాన్ని సృష్టించుకుంది. మనసును పొదుపు చేసుకొని, మనుగడలో కుదుపును ఆపుకొని, మహా వైభవంతో శోభించాడు, శోభిస్తున్నాడు మారుతి.

18 వ పేజీ లోని ఖాళీలకు జవాబులు :-

1. భూమిపూజ 2. కోణార్క 3. దసరా 4. ఆగమశాస్త్రము 5. విదురుడు

19 వ పేజీ లోని పొడుపుకథలకు జవాబులు :-

1. నాలుక



4. కనురెప్పలు



2. కొబ్బరిబొండం



5. చంద్రుడు



3. వక్క, తమలపాకు, సున్నం



విష్ణుసహస్రనామం - 5

స్వామి సుందర చైతన్యానంద

ఆలోచించకుండా మనస్సు ఉండలేదు. ప్రేమించకుండా మనిషి ఉండలేడు. కాకపోతే, మనం దేనిని ప్రేమిస్తున్నామో, దేనికొరకు ప్రేమిస్తున్నామో క్షుణ్ణంగా తెలియాలి. ప్రేమించటం తప్పు కాదు. ప్రేమలో దోషం లేదు. కాని, ఒకరికి ఇవ్వవలసిన ప్రేమను మరొకరికిస్తే, దానివల్ల ఇచ్చిన వారికి సుఖముండదు. పుచ్చుకున్న వారికి సుఖముండదు.

ప్రేమలో ఆకర్షణ ఉంటుంది. అంతే కాదు. ఆనందం కూడా ఉండాలి. ఆకర్షించే వన్నీ ఆనందాలు కాకపోవచ్చు. ఆకర్షించటమే గాక, చెడని, చెడిపోని ఆనందాన్ని ప్రసాదించేవాడు పరమాత్మ. మట్టి బొమ్మలతో బిడ్డ ఆడుకోవచ్చు. తాత్కాలికంగా ఆనందాన్ని పొందవచ్చు. ఆకలైతే అమ్మ దగ్గరికే రావాలి. పాలు అమ్మ నుండే వస్తాయి. బొమ్మ నుండి రావు. ఆనందం కూడా అంతే. అది ప్రపంచం నుండి వచ్చేది కాదు. పరమాత్మ జ్ఞానంలో ప్రాప్తించేది.

జీవితంలో కలిసొచ్చే వారెందరో? కలిసిపోయే వారెందరో? కలిసి - పోయేవా రెందరో? పోయేవారు ఉండేవారు కారు. వచ్చేవారు పోకుండా ఉండరు. సర్వదా, సర్వత్ర కలిసి ఉండే దెవరు? అనే ప్రశ్న పడితే, 'పరమాత్మ ఒక్కడే' - అని సమాధాన మొస్తుంది.

మరి, ఆ పరమాత్మ చిరునామా ఏమిటి? ఎక్కడ? అనంతనాముని చిరునామా కావాలా? అయితే, - ఇదే విష్ణుసహస్రనామం.

జీవితంలో కొన్నిటిని నమ్మాలి. కొన్నిటిని అర్థం చేసుకోవాలి. స్వర్గం ఉందంటే, ఆ లోకం, ఈ లోకం, యమలోకం ఉందంటే నమ్మాలి. పరిశీలించి పరీక్షించుకొనే అవకాశం లేదు కనుక.

నీటిలో హైడ్రోజన్, ఆక్సిజన్ కలిసున్నా యనేది నమ్మాల్సిన విషయం కాదు. అర్థం చేసుకోవల్సిన విషయం. జ్ఞానానికి సంబంధించిన విషయం. నమ్మవలసిన వాటిని అర్థం చేసుకొని పొందేదేమీ ఉండదు. అర్థం చేసుకోవలసిన వాటిని నమ్మి సాధించేదీ ఉండదు.

పరమాత్మ విషయం జ్ఞాన విషయం. **వస్తు సిద్ధిః విచారేణ** - ప్రమాణ విచారంలో గ్రహింప వలసిన విషయం. అదే, ప్రస్తుతం విష్ణుసహస్రనామ రూపంలో మన ముందున్న పవిత్ర విషయం. పరమాత్మ రూపం పరమాత్మదే. మరొకరిది కాదు. పరమాత్మ నామం పరమాత్మదే. మరెవరిదో కాదు.

పరమాత్మ నామంలో పరమాత్మ వైభవం దాగి ఉంది. ఈ సత్యం అర్థమైన పుణ్యాత్ములకి నామస్మరణలో సత్యదర్శన మవుతుంది. మనస్సు ధ్యానంలో లయించి పోతుంది. తరించి పోతుంది.

ఈ కారణం గానే, విష్ణుసహస్రనామ స్తోత్రానికి భాష్యాన్ని ప్రారంభిస్తూ, **సకల పురుషార్థ సాధనం సుఖ సంపాద్యం అల్ప ప్రయాసం అనల్ప ఫలం** - అని నామవైభవాన్ని వర్ణించారు శ్రీశంకరాచార్య స్వామి.

నామ సంకీర్తనము చతుర్విధ పురుషార్థ ఫలసిద్ధిని అనుగ్రహిస్తుంది. **సుఖ సంపాద్యం** - కష్టం తెలియని కార్యము. సులభమైన సాధన. **అల్పప్రయాసం - అనల్పఫలం**.......శ్రమ తక్కువ. ఫలమెక్కువ.

అనల్పఫలం అనే మాటలో భావగర్భితమైన ఉపనిషత్సందేశ ముంది. అనల్ప మంటే అల్పం కానిది. ఉపనిషత్తు ఒక విషయాన్ని అందంగా ప్రవచించింది.

యత్ర అన్యత్పశ్యతి అన్యచ్ఛృణోతి అన్యద్విజానాతి తదల్పం.

ఎక్కడ రెండవది కనిపిస్తుందో, వినిపిస్తుందో, అనిపిస్తుందో అది అల్పం. **యదల్పం తన్మర్త్యం.** ఏదయితే అల్పమో అది నశిస్తుంది. అనల్ప ఫలమంటే నశించని ఫలం. ఆత్మ ఫలం. నిర్వికల్పానందము. ఇట్టి దివ్యానుభూతిని విష్ణుసహస్రనామ స్తోత్రం ప్రసాదిస్తుంది. దివ్యమైన ఈ స్తోత్రంలో ప్రథమనామం...........**విశ్వం.**

శ్లో॥ విశ్వం విష్ణు ర్వషట్కారో భూత భవ్య భవత్ప్రభుః ।
భూత కృద్భూతభృద్భావో భూతాత్మా భూత భావనః ॥

1. విశ్వం

పరమాత్మను "విశ్వం" అనే నామంతో ప్రథమంగా కీర్తిస్తూ విష్ణుసహస్రనామ స్తోత్రం ప్రారంభమవుతూ ఉంది.

విశ్వస్య జగతః కారణత్వేన విశ్వ మిత్యుచ్యతే బ్రహ్మ

విశ్వానికి కారణ మైనందున పరమాత్మ విశ్వమని కీర్తింప బడినాడు. కనుక, విశ్వాన్ని అధ్యయనం చేయడమంటే విష్ణువును అధ్యయనం చేయడమనే భావం. ఇది శ్రద్ధతో విశ్లేషించాల్సిన విషయం.

కార్యరూపంలో ఏది గోచరించినా దాని వెనుక కారణముండాలి. కారణం నుండి ఉత్పన్నం కావడం చేత కార్యం కారణం కన్నా వేరుగా ఉండలేదు. కుండ కార్యం. మట్టి కారణం. ఇది మనకు తెలుసు. ఈ విధమైన కారణ కార్యాలలో సత్యమేది? **మృత్తికేత్యేవ సత్యమ్**. . . మట్టియే సత్యము. కుండ సత్యం కాదా? కాదు. ఎందుకని? మరొక దాని మీద ఆధారపడి ఉండేది ఏదీ సత్యం కాదు. మట్టి లేనిదే కుండ లేదు. కనుక కుండ సత్యం కాదు. కాని, కుండలేకపోయినా మట్టి ఉంటుంది. కనుక మట్టి సత్యం. కుండలో తల దూర్చితే, మట్టిలో తేలుతాం. విశ్వం తలకెక్కితే తలపులలో విష్ణువే కదుల్తాడు.

విశ్వం విష్ణువు కన్నా వేరు కాదని తెలిసింది! ఇక ఎక్కడి తగాదాలు! విభేదాలు! మట్టి పాత్రలలో ఉన్నదంతా మట్టే. బావుంది. మరి, కుండ, కూజా, మూకుడు ఇవన్నీ ఏమిటి? అవి కూడా మట్టే. కార్యరూపంగా గోచరించే మట్టి పాత్రలలో ఉన్నదంతా కారణమైన మట్టే. కాని, మట్టి పాత్రల లోని నామరూపాలు కారణమైన మట్టిలో లేవు.

ఈ విషయాన్ని ఛాందోగ్యోపనిషత్ అత్యంత వైభవోపేతంగా వివరించింది.

యథా సౌమ్య! ఏకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్!
వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్.

మట్టి పాత్రలలో ఉన్నదంతా మట్టే. నామ రూపాలన్నీ వాచారంభణం. నామధేయం మాత్రమే. దేనికి నామధేయం? రూపానికే. రూపం ఉంది కనుక నామం ఉంది. కుండ అనే రూపం ఉంది కనుక కుండ అనే నామముంది. వాస్తవానికి మట్టే సత్యము. ఉన్నదంతా మట్టేనని తెలిస్తే ఇక భేదా లెలా ఉంటాయి? విభేదా లెలా వస్తాయి? ఈ సత్యం అర్థం కాకపోతే అన్నీ జగడాలే. ఆగడాలే.

"నేను కుండను. నీకన్నా పెద్ద దానినే కూజా!". "నేను కూజాను. అంద ముండాలి గాని కండబల మెందుకే కుండా?". ఇదీ జగడం. జగత్తులో గండం. కుండలో, కూజాలో రెండిట్లో ఉండేది మట్టేనని తెలిస్తే తేడాలెలా వస్తాయి? విభేదాలెందుకుంటాయి?

మట్టి పాత్రలలో అంతా మట్టే. ప్రపంచంలో అంతటా పరమాత్మే. **సర్వం విష్ణుమయం జగత్.** ఈ విశ్వమంతయు విశ్వనాథుడే.

సద్బ్రహ్మ కార్యం సకలం సదైవ సన్మాత్ర మేతత్ న తతోన్యదస్తి.

విశ్వం కార్యం. విష్ణువు కారణం. విశ్వంలో ఉన్నదంతా విష్ణువే. విశ్వం విష్ణువు కన్నా అన్యం కాదు. విష్ణు వేమిటో తెలిస్తే విశ్వమంతా విష్ణుమయంగా గోచరిస్తుంది.

పురుష ఏ వేదం విశ్వం - ఇదం విశ్వం - సర్వం - పురుష ఏవ

ఈ ప్రపంచ మంతయు విష్ణువే. ఈ సత్యం అర్థమయితే ఇతరులను ప్రేమించకుండా ఉండలేము. ఎందుకని? ఇతరులలో ఉండేది కూడా నీవే. ఇక్కడ కేవలం ప్రేమించమని తెలిపే సూక్తే కాదు. ఎందుకు ప్రేమించాలో తెలిపే యుక్తి కూడా ఉంది. ఏదయితే నీకు ప్రతికూలమో అది ఇతరుల విషయంలో చేయలేవు.

ఆత్మనః ప్రతికూలాని పరేషాం న సమాచరేత్

"నీకు ఏదయితే ప్రతికూలమో అది ఇతరులకు నీవు చేయకూడదు" అనే శాస్త్ర వచనాన్ని విష్ణుసహస్రనామంలో ప్రథమ నామమైన "విశ్వం" పై వ్యాఖ్యానిస్తూ ఉటంకించారు శ్రీ శంకరాచార్య స్వామి.


విశ్వం విష్ణువు కన్నా వేరు కాదని తెలిసింది. ఈ సత్యం అర్థం కానంత వరకు జీవితం తడిసిన వత్తిలా అలా పడి ఉంటుంది. అర్థమైన క్షణాన జ్యోతిలా ప్రకాశిస్తుంది. జ్ఞానంలో పండుతుంది. ఇక్కడే పరాభక్తి పరాకాష్ఠ నందుకుంటుంది.

ఓం నమో భగవతే వాసుదేవాయ

(సశేషం)

SWAMIJI - THE LIGHT OF MY LIFE

Dr. Ch. Mohan Rao, M.D.,D.M.
Neurologist, Apollo Hospitals,
Hyderabad.



I deem it a great privilege to write an article for Pujya Swamiji's Giridhari, a spiritual magazine with the largest circulation in our state. I attempt to write this article only with the blessings of Pujya Swamiji.

Though I was interested in the epics, the Vedanta and Indian philosophy from my school and college days, I could not have a clear concept of the subject even after hearing discourses of quite a few scholars and spiritual teachers, and even after visiting a few ashrams.

As a doctor, I discharged my duties to the satisfaction of my patients and regularly read medical books and journals to keep abreast of the latest developments in my field. But there remained in me a dissatisfaction and an inexplicable fear of the uncertainties of life.

As Pujya Swamiji often quotes:

Soka sthani sahasrani bhayasthani sathani cha

There are thousands of miseries and hundreds of fears threatening our human life.

We all know there are countless universities all over the world giving secular education based on facts, science, etc., for achieving academic success but none of those can give the contentment which a spiritual seeker enquiring after the TRUTH desires for himself.

In March 1991, when I was a senior resident in Neurology at NIMS, Hyderabad, I had the opportunity to have Pujya Swamiji's darshan at Dowlaiswaram ashram. The few minutes which Pujya Swamiji gave me are the most memorable moments of my life and

since then I am an ardent devotee of Pujya Swamiji - my beloved Guru, and a fortunate member of Sundara satsang.

Attending Pujya Swamiji's lectures and studying His vedantic literature, I now have a clear understanding of Advaita philosophy and of life, as a whole. Life is no more a mystery to me, nor do I feel working for living a burden, for every deed that we do is done with the help of, and for the sake of the Almighty Himself. I now wish that I may be blessed with long life, full of joy, which the knowledge of my Sadguru has bestowed on me.

Kurvanneveha karmani jijeevisheth satam samaah

Doing good and virtuous deeds man should live a hundred years - says the *Esavasyopanishad.*

The relation that we have with the Almighty is eternal and whole unlike the worldly relations that are short-lived and imperfect. Everything in this world has a place and everything is in its place - this is the order or *Niyati* of the Almighty. Owing to our limitations we have to accept that we are not gods! But we can surely rise above our limitations one day and become god-like with the grace of our Sadguru who has entered the lives of thousands as a god-send. Every disciple of Pujya Swamiji will certainly reach this stage one day or another.

Nanyah pandhah ayanaya vidyate

There is no other way but knowledge for liberation.

Birth and death are mere punctuations in Eternity; and Eternity can be attained only with the help of right knowledge imparted to us by our Sadguru - our guide, protector and saviour.

Jai Jai Gurudev!

ఓం నమో భగవతే వాసుదేవాయ

228 వ జ్ఞాన యజ్ఞము

13-3-2016 నుండి 20-3-2016 వరకు

విశాఖపట్టణం - ఆళ్వార్‌దాస్ గ్రౌండ్స్‌లో

(ఎమ్.వి.పి.కాలనీ)

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు, పూజ్య గురుదేవులు

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి

అమృతోపన్యాసములు

సాయంత్రం 6.30 నుండి 8.00 వరకు

శ్రీమద్భాగవతము - దశమ స్కంధము

(శ్రీకృష్ణ జననం నుండి కంసవధ వరకు)

ఉదయం 6.30 నుండి 7.30 వరకు

లక్ష్మీధరకవి విరచితం

అద్వైత మకరందము





ప్రారంభ సభ

13-3-2016

సాయంత్రం 6.30 గంటలకు

భగవత్సేవలో ... సుందర సత్సంగ్, విశాఖపట్టణం

రాజపోషకులు

రూ.5,000/-



చి॥ వి.రోహన్ శ్రీఅంకిత్
రాజమండ్రి

కె.వంశీ మోహన్ కృష్ణ
హైదరాబాద్

చి॥ కీర్తిక కోహీర్
సంగారెడ్డి

శ్రీమతి డి.లాలమ్మ
శ్రీ డి.ఓబులాపతి
ఖమ్మం

శ్రీమతి ఎమ్.శ్రీవల్లి రాణి
శ్రీ ఎమ్.వాసుదేవ కుమార్
కడప



శ్రీమతి సి.హెచ్.సత్యవతి
గుంటూరు

శ్రీమతి డి.రజని
హైదరాబాద్

శ్రీమతి ఎమ్.కళ్యాణి
కర్నూలు

శ్రీమతి ఎమ్.జయలక్ష్మి
శ్రీ ఎమ్.లింగయ్య
హైదరాబాద్

శ్రీమతి వసంత
శ్రీ వెంకటేశ్
హైదరాబాద్



శ్రీ వెంకట్రావు
రాజమండ్రి

శ్రీ పి.సాయిప్రసాద్
నల్గొండ

శ్రీ సి.హెచ్.కృష్ణారావు
గుంటూరు

శ్రీమతి ఎమ్.లక్ష్మి
శ్రీ ఎమ్.లింబాద్రి
మెట్‌పల్లి

శ్రీమతి ఎ.సురేంద్రమణి
శ్రీ ఎ.ఎమ్.సత్తయ్య
హైదరాబాద్



శ్రీమతి ఆకుల కౌసల్య
వరంగల్

శ్రీమతి పి.వేదవతి
చెన్నై

శ్రీమతి సి.సక్కూబాయి
కోహీర్

శ్రీమతి ప్రసన్న లక్ష్మి
శ్రీ జి.ప్రవీణ్ కుమార్
హైదరాబాద్

శ్రీమతి సుష్మ
శ్రీ రజనీశ్
హైదరాబాద్



శ్రీ ఎల్.శివన్నారాయణ
హైదరాబాద్

చి॥ ఎ.గీతా వైష్ణవి
షోలాపూర్

శ్రీ డి.సాయికృష్ణ
నిజామాబాద్

శ్రీమతి డి.మల్లీశ్వరి
శ్రీ డి.కైలాస్
నిర్మల్

శ్రీమతి సుబ్బమ్మ
శ్రీ బి.ఇ.లక్ష్మీ నారాయణ శెట్టి
కాశి